మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 96 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## గుజరాత్‌లోనూ అయోధ్య ఫలితమే

- అక్కడా కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుంది
- రాహుల్



అహ్మదాబాద్ (ప్రజా మంటలు): అయోధ్యలో భాజపాను ఓడించినట్లే.. గుజరాత్‌లోనూ ఆ పార్టీపై ఇండియా కూటమి విజయం మిగతా 2లో..





# కలిసి నడుద్దాం!

## - అపరిష్కృత సమస్యల్ని చర్చించి పరిష్కరించుకుందాం



- సహృద్భావ వాతావరణంలో రెండు రాష్ట్రాల సీఎం సమావేశం
- విభజన చట్టంలో ఆస్తులు, అప్పులపై చర్చ
- సమస్యల పరిష్కారానికి కమిటీల ఏర్పాటుకు నిర్ణయం
- మొదట అధికారుల కమిటీలో చర్చించి నిర్ణయాలు
- అక్కడ పరిష్కారం కాకపోతే మంత్రుల కమిటీలో చర్చ
- ఆ తరవాత సీఎంల కమిటీలో నిర్ణయాలు
- పరస్పర అవగాహనతో పరిష్కారానికి కృషి
- భేటీ వివరాలు మీడియాకు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి

### ప్రధానంగా చర్చించిన అంశాలివే..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు
విభజన చట్టంలో పేర్కొనని సంస్థల ఆస్తుల పంపకాలు
ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు
పెండింగ్ విద్యుత్తు బిల్లులు
విదేశీ రుణ సాయంతో ఉమ్మడి రాష్ట్రంలో 15 ప్రాజెక్టులు నిర్మించారు. వాటి అప్పుల పంపకాలు
ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చుకు చెల్లింపులు
హైదరాబాద్‌లో ఉన్న మూడు భవనాలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించే అంశం - లేబర్ సెస్ పంపకాలు
ఉద్యోగుల విభజన అంశాలు



హైదరాబాద్, (ప్రజా మంటలు): విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. మిగతా 2లో..



## ప్రభుత్వ సలహాదారుగా కెకె

### కేబినేట్ ర్యాంక్ కల్పిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 6 (ప్రజామంటలు): మాజీ ఎంపీ, సీనియర్ నేత కే.కేశవరావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. బీఆర్ ఎస్ పార్టీలో సీనియర్ లీడర్ గా, కేసీఆర్ కు సన్నిహితుడిగా కొనసాగిన కేకే .. ఈ మధ్యే ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేకే కూతురు జిహెచ్ఎంసి మేయర్ గా ఉన్న గద్వాల్ విజయలక్ష్మి కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. మిగతా 2లో..

**'మెదడును తినే అమిబా'..**
- కేరళలో మరో కేసు నమోదు
- మొత్తం నలుగురికి సోకిన వైరస్ 3లో..

**ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా మసౌద్ పెజెష్కియాన్** 3లో..
- సంస్కరణవాదికే పట్టకట్టిన దేశ ప్రజలు

**జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..**
- ఆర్మీ జవాన్ మృతి 3లో..

**మంత్రి శ్రీధర్ బాబుతో విపక్ష ఎమ్మెల్యే భేటీ** 7 లో..

## 22నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు - 23న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నిర్మలా సీతారామన్


### వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు




న్యూఢిల్లీ,జూలై6 (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించి, నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే కూటమి కొలువుదీరిన వేళ..ఇటీవలే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం జులై 23న బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నిర్మలమ్మ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తున్నారు. మోదీ 3.0లో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇదే. దీంతో వరసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. ఇప్పటి వరకు మొరార్జీ దేశాయ్ వరసగా ఆరుసార్లు

## కాంగ్రెస్‌లో చేరిన మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

### - బండ్లను కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవని బీఆర్ఎస్ కు వరుస షాకులు తగులుతున్నాయి. మొన్న ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ చేరగా... తాజాగా మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ లోకి బండ్ల చేరికతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఒక్క అలంపూర్ స్థానం మినహా బీఆర్ఎస్ ఖాళీ అయ్యింది. అలంపూర్ నుండి విజయుడు బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఏడురుగు ఎమ్మెల్యేలు చేయిని అందిపుచ్చుకున్నారు.

**తలలు పట్టుకుంటున్న బిఆర్ఎస్ నేతలు**

తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఎప్పుడు గులాబీ కండువా తీసేసి.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. మిగతా 2లో..

## ప్రజా నాడి






## నీట్ యూజి కౌన్సిలింగ్ వాయిదా

### తదుపరి ఉత్వర్వులు ఇచ్చేవరకు నిలిపివేత

న్యూఢిల్లీ,జూలై6 (ప్రజా మంటలు): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాల వ్యవహారం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ వాయిదా వేసింది. వాస్తవానికి ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా.. తదుపరి మిగతా 2లో..



## నియోజకవర్గానికో నాలెడ్జ్ సెంటర్

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించ నున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి మల్లు విక్రమార్క అన్నారు. ఇసచివాలయంలో మంత్రి సీతక్కతో కలిసి బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల కోచింగ్‌కు నిపుణులైన వారితో ఉచితంగా గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. నాలుగు నెలల్లో ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు రీయింబ్స్‌మెంట్ పథకం అందుబాటులోకి వచ్చాకి వేలాది మంది బీటెక్ పూర్తి చేసి స్కిల్స్ లేక గ్రామాల్లోనే ఉండిపోతున్నారన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ మిషన్ భగీరథ పథకం పనితీరుపై ఈ నెల 15 వరకు నివేదిక ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ నీటిని వినియోగించుకునే అంశం గ్రామసభల్లో ఓ ఎజెండాగా చేర్చాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ డ్రింకింగ్ మిగతా 2లో..

యువతకు స్కిల్ శిక్షణ కోసం ఏర్పాటు

బడ్జెట్ సన్నాహక సమావేశంలో డిప్యూటి సిఎం సీతక్కతో కలసి సమీక్షించిన భట్టి విక్రమార్క

మిషన్ భగీరథ నిధుల దుర్వినియోగంపై ఆరా

ప్రతి ఆవాసానికి మంచినీరు అందించాలని ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

# కలిసి నడుద్దాం



దాదాపు రెండు గంటలపాటు సాగిన భేటీలో పది కీలక అంశాలపై ముఖ్యమంత్రులు చర్చించారు.సమస్యల పరిష్కారానికి మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ముఖ్యంగా ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా పరిష్కారాలు ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారుల సూచనలు తీసుకున్నారు. న్యాయపరమైన చిక్కులపై కూడా చర్చించారు. షెడ్యూల్ 10లోని అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. నిర్ణీత వ్యవధిలో సమస్యలు పరిష్కరించుకోవాలనే ఏకాభిప్రాయానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చినట్టు తెలిసింది.తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి.సి.జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారువిభజన చట్టంలో ఉన్న ఆస్తులు, అప్పులపై చర్చిస్తూ.. హైదరాబాద్‌లో కొన్ని భవనాలు ఏపీకి ఇవ్వాలని చంద్రబాబు కోరగా.. హైదరాబాద్‌లో ఉన్న స్థిరాస్తులు మొత్తం తెలంగాణకే చెందుతాయని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. కావాలంటే ఢిల్లీలో ఏపీ భవన్ తరహాలో భవనం కట్టుకునేందుకు పర్మిషన్ ఇస్తామని తెలంగాణ సర్కార్ చెప్పింది.భద్రాచలంలో నుంచి ఏపీలో కలిపిన 7 మండలాల్లోని ఐదు గ్రామాలను తెలంగాణ ప్రభుత్వం అడిగింది. కేంద్ర హోంశాఖకు లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మరోసారి సీఎస్‌ల స్థాయిలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. విభజన సమస్యలపై రెండు కమిటీలు ఏర్పాటుకు నిర్ణయించగా, మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయనున్నారు.షెడ్యూల్ 9,10లోని ఆస్తుల పంపకం, ఏపీ రావాల్సిన 7,200 కోట్ల విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థలపై షీలా భిడే కమిషన్ సిఫార్సుల అమలు, ఫైనాన్స్ కార్పొరేషన్, ఉద్యోగుల విభజన అంశాలు, లేబర్ సెస్ పంపకాలపై చర్చ జరిగింది..అంతకు ముందు ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. కాళోజీ రచించిన 'నా గొడవ' పుస్తకాన్ని చంద్రబాబుకు బహూకరించారు. అనంతరం భేటీ అయి.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు కలిసి ముందుకు సాగేందుకు, ఉమ్మడిగా అభివృద్ధి సాధించేందుకు ఈ ఇద్దరు ముఖ్యనేతల సమావేశం వేదికైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణతో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు.

**వివరాలు వెల్లడించిన భట్టి**

సీఎంల భేటీలో అనేక అంశాలపై లోతుగా చర్చలు జరిగాయని.. పదేళ్లుగా పరిష్కారం కాని అంశాలపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో సీఎస్, ముగ్గురు సభ్యులు ఉంటారని చెప్పారు. సమస్యలు త్వరగా పరిష్కరించుకోవాలని నిర్ణయించామని అన్నారు. కమిటీ పరిష్కరించలేని సమస్యలపై మంత్రులతో కమిటీ వేస్తామని వెల్లడించారు. కమిటీల ద్వారా విభజన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసిన తర్వాత భేటీ వివరాలను భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. గత పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని అంశాలపై సమావేశంలో మాట్లాడుకున్నాం. రెండురాష్ట్రాల ముఖ్యమంత్రులు కూలంకషంగా చర్చించిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాం. ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ వేయాలని నిర్ణయించాం.సీఎస్‌లు, ముగ్గురు అధికారులతో రెండు వారాల్లోగా కమిటీ ఏర్పాటు చేస్తాం. వీరి స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై మంత్రులతో మరో కమిటీని వేయాలని తీర్మానించాం. అక్కడ కూడా పరిష్కారం కాని అంశాలుంటే ముఖ్యమంత్రుల స్థాయిలో పరిష్కార మార్గం కనుగొనాలని నిర్ణయించాం అని వివరించారు.. అలాగే డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడికి రెండు తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించాం' అని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఏపీ మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు జాతి హర్షించే రోజు అని వ్యాఖ్యానించారు. విభజన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సీఎంలు మందుకు రావడం శుభపరిణామమన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ఏపీలోనూ చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఏపీ మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేశ్ తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. విభజన సమస్యలపై ప్రజా భవన్‌లో రెండు గంటలపాటు ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఇరు రాష్ట్రాల మంత్రులతో ఉప సంఘం వేయాలని నిర్ణయం తీసుకున్నారు. శాఖలవారీగా చర్చల కోసం అధికారులతో మరో కమిటీ వేస్తామని సూతప్రాయంగా తెలిపారు. చర్చల ద్వారా, పట్టు విడుపులతో సమస్యలు పరిష్కరించుకోవాలని సమావేశంలో ముఖ్యమంత్రులు అంగీకారం తెలిపారు. నీటి పంపిణీపై మరోసారి సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారు. భద్రాచలం నుంచి ఆంధప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాల్లో గల 5 గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని చంద్రబాబును రేవంత్ రెడ్డి అడిగారని తెలిసింది. ఎటపాక, గుండాల, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు పంచాయతీలను విలీనం చేయాలని కోరినట్టు సమాచారం. ఇదే అంశంపై కేంద్ర హోం శాఖకు లేఖ రాయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిసింది. హైదరాబాద్‌లో కొన్ని భవనాలు తమకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. అందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తిరస్కరించారని వార్తలు వస్తున్నాయి.

# గుజరాత్‌లోనూ అయోధ్య ఫలితమే

సాధిస్తుం దని కాంగ్రెస్ అగ్రనేత, రాయ్‌బరేలి ఎంపీ రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు.అహ్మదాబాద్‌లో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో రాహుల్ మాట్లాడారు. " కలిసికట్టుగా పోరాడి అయోధ్యలో భాజపాను ఓడించినట్లే.. గుజరాత్‌లోనూ నరేంద్రమోదీని, ఆ పార్టీని ఓడిస్తాం. విమానాశ్రయ నిర్మాణం పేరుతో అయోధ్యలోని సామాన్యుల భూములను కొల్లగొట్టారు. ఎంతో మంది తమ విలువైన స్థలాలు కోల్పోయారు. రామమందిర ప్రారంభోత్సవానికి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులను, ధనవంతులను ఆహ్వానించిన కేంద్రం.. స్థానికులను మాత్రం పిలవలేదు" అని విమర్శించారు. ఇటీవల రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాహుల్ పరామర్శించారు.కేంద్రం తీసుకొచ్చిన అగ్నివీర్ పథకంపై తీవ్ర పార్లమెంట్ వేదికగా తీవ్ర అభ్యంతరం తెలిపిన రాహుల్ గాంధీ.. తాజాగా 'ఎక్స్' లో విమర్శలు గుప్పించారు. విధి నిర్వహణలో ఇటీవల ప్రాణాలు కోల్పోయిన అగ్నివీరుడు అజయ్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఎలాంటి పరిహారం లభించలేదని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను పోస్టు చేశారు. ఆర్మీ గ్రూప్ ఇన్సూరెన్స్ ఫండ్ నుంచి రూ.48 లక్షలు, ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి మరో రూ.50 లక్షలు వచ్చినట్లు అగ్నివీరుడి తండ్రి చెప్పారని.. అయితే అతడికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా సంగతి ఏంటని రాహుల్ ప్రశ్నించారు. జీతం బకాయిలు ఎందుకు అతడి ఖాతాలో జమ చేయలేదని నిలదీశారు.ప్రభుత్వం కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే చెల్లించింది. ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఈ రెండింటికీ తేడా ఉంది. అగ్నివీరుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ కంపెనీలే చెల్లించాయి తప్ప, ప్రభుత్వం ఇచ్చిందేమీ లేదు" అని రాహుల్ అన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలను కేంద్రం గౌరవించి తీరాలని, కానీ ప్రధాని మోదీ మాత్రం.. వారిపై వివక్ష చూపుతున్నారని రాహుల్ విమర్శించారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమన్న ఆయన.. కేంద్రం ఏమనుకున్నా సరే.. ఈ అంశాన్ని పదేపదే లేవనెత్తుతూనే ఉంటానని తెలిపారు. రక్షణ బలగాలను ఇండియా కూటమి ఎప్పటికీ బలహీన పరచబోదని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో చేరిన మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే



ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కారు దిగి హస్తం గూటికి చేరడం.. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారనే వార్తలతో పార్టీ పరిస్థితి ఏంటనేది హైకమాండ్‌కే తెలియక తలలు పట్టుకుంటోంది..! ఈ క్రమంలో గద్వాల ఎ మ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా సిఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే మూకుమ్మడిగా కాకుండా ఒకకొక్కరుగా పార్టీని వీడడం అర్థం కావడం లేదు. సరిగ్గా ఈ క్రమంలోనే తెలంగాణ భవన్ వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ కీలక సమావేశానికి పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసలే మరో ఆరుగురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే వార్తల నేపథ్యంలో భేటీ జరగడం.. ఈ సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే అనుమానాలకు తావిచ్చినట్లయ్యింది. తొలిరోజు సమావేశానికి రాలేదు సరే.. రెండో రోజు కూడా హాజరుకాకపోవడంతో పార్టీ మార్పు పక్కా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో వేదికగా కీలక సమావేశం నిర్వహించడం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా శనివారం జరిగన కౌన్సిల్ సమావేశానికి రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కౌన్సిల్ భేటీకి ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి డుమ్మా కొట్టారు. కౌన్సిల్ భేటీకి కచ్చితంగా హాజరుకావాలని అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఏమయ్యారు..? బీఆర్ఎస్‌కు బై బై చెప్పడానికి రంగం సిద్ధం చేసుకున్నారా..? లేకుంటే మరేదైనా కారణాలతో డుమ్మా కొట్టారా అనేది తెలియట్లేదు.రాష్ట్ర రాజధాని పరిధిలో బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ఏడుగురు శక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. కండువాల మార్పిడి సీజన్ నడుస్తోన్న సమయంలో ఒకరోజు ముందు సమాచారమిచ్చి మరీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌కు హైదరాబాద్‌లోనే ఉండి కూడా కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడం పార్టీ మారుతారనే వార్తలకు బలం చేకూరుతోంది. నిన్నటి సమావేశానికి.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), పద్మారావు (సికింద్రాబాద్), ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), సుధీర్‌రెడ్డి(ఎల్‌బీనగర్), మాగంటి గోపినాథ్(జూబ్లీహిల్స్), ముఠా గోపాల్ (ముషీరాబాద్), కాలేరు వెంకటేష్(అంబర్‌పేట) హాజరయ్యారు. అయితే.. అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), మాధవరం కృష్ణారావు(కూకట్‌పల్లి), బండారి లక్ష్మారెడ్డి(ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజ్‌గిరి), కేపీ వివేకానందగౌడ్ (కుత్బుల్లాపుర్), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు)లు రాలేదు. దీంతో ఇవాళ అయినా.. కౌన్సిల్‌కు వస్తారనుకుంటే రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

## ప్రభుత్వ సలహాదారుగా కెకె

కెకె రాజ్యసభ ఎంపీగా తన పదవీకాలం ఇంకా రెండేండ్లు మిగిలి ఉండగానే రాజీనామా చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యానని... ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేశాను అని తెలిపారు. 2026 ఏప్రిల్ 9 వరకు రాజ్యసభ ఎంపీగా కేకే పదవీకాలం ఉంది. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్‌గా పని చేసిన కేకే..జూలై 3న కాంగ్రెస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ లోనే సుదీర్ఘకాలం ఉన్న ఆయన.. పీసీసీ చీఫ్‌గా పని చేశారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో సిఎం ఆయనకు సలహాదారు పదవిని కట్టబెట్టారు.

# సీఎం కేజ్రీవాల్ బెయిల్ నిలిపివేయంపై ఆందోళన

### - సీజేఐకు 150 మంది న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి):

లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు నిలిపివేయడంపై 150 మంది న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు.కోర్టులు ఆచరిస్తున్న అసాధారణ పద్ధతులపై జోక్యం చేసుకోవాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు.లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆర్డర్ ఉత్తర్వులు అప్‌లోడ్ చేయడానికి ముందే ఢిల్లీ హైకోర్టులో ఈడీ ఎలా సవాల్ చేసింది?, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్ జైన్ ఈడీ సవాల్‌పై ఎలా విచారణ చేపట్టి ఆర్డర్‌ను హోల్డ్‌లో ఉంచారు? బెయిల్ అమలును ఎలా నిలిపివేశారు? అని ప్రశ్నించారు. భారత న్యాయవ్యవస్థ చరిత్రలో ఇలాంటివి ఎప్పుడూ చూడలేదని, ఇది న్యాయవాదుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించిందని 9 పేజీల లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా న్యాయవాదుల సమర్పణలను న్యాయమూర్తులు తమ ఆదేశాలలో రికార్డ్ చేయడం లేదని న్యాయవాదులు ఆరోపించారు. ఇది కోర్టు చరిత్రలో మొదటిసారి అని, ఇది చాలా అసాధారణమైనదని పేర్కొన్నారు. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విచారణ సమయంలో చేసిన సమర్పణలను న్యాయవాదుల ముందు, కేసు వాయిదా వేయడానికి ముందు రికార్డ్ చేయాలని ఆదేశాలు జారీ చేయవలసిందిగా అభ్యర్థించారు.బెయిల్ మంజూరులో జాప్యం గురించి ప్రస్తావిస్తూ.. 'ముఖ్యంగా ఈడీ, సీబీఐకు సంబంధించిన కేసుల్లో న్యాయమూర్తులు ఎక్కువ వ్యవధిలో విచారణ తేదీలు ఇస్తారు. బెయిల్ విషయాలను త్వరగా పరిష్కరించరు. న్యాయ సూత్రాలకు, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ హామీకి ఇది విరుద్ధం.ఈ దేశ ప్రజలు ఎంతో ఆశతో, విశ్వాసంతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నమ్మకాన్ని న్యాయవ్యవస్థ, న్యాయ సంఘం సమర్థించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలోనే మా ఆందోళనలను మీతో పంచుకుంటున్నాం. వీటిని త్వరగా సరిదిద్దుతారని ఆశిస్తున్నాం.' అని లేఖలో ప్రస్తావించారు.

## సూరత్‌లో కుప్పకూలిన భవనం 15మందికి తీవ్ర గాయాలు

గాంధీనగర్ (ప్రజా మంటలు):

గుజరాత్ లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ పట్టణంలోని సచిన్ పాలీ ప్రాంతంలో ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలైనట్లు అధికారులు తెలిపారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయి ఉండొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న సహాయ బృందాలు.. శిథిలాలు తొలగించే పనిలో నిమగ్నమయ్యాయి. భవనం అప్పటికే శిథిలావస్థకు చేరుకుందని, కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయినట్లు భావిస్తున్నామని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# నీట్ యూజి కౌన్సిలింగ్ వాయిదా

### తదుపరి ఉత్వర్వులు ఇచ్చేవరకు నిలిపివేత

నోటీసులు ఇచ్చేంత వరకు దాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త తేదీలను కేంద్ర విద్యాశాఖ త్వరలోనే ప్రకటిస్తుందని తెలిపింది. కాగా.. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ ఎన్‌టీఏ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించారు. అయితే పరీక్ష పేపర్ లీక్ అవడంతో పాటు పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నీట్ అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు సహా నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లతో సుప్రీం కోర్టులో దాదాపు 26 పిటిషన్లు దాఖలయ్యాయి. నీట్–యూజీ పరీక్షను రద్దు చేయడం హేతుబద్ధం కాదు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. కౌన్సెలింగ్ వాయిదా వేయాలన్న పిటిషనర్ల అభ్యర్థులను తోసిపుచ్చింది. మరోవైపు, సుప్రీం ఆదేశాల మేరకు ఇటీవల గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించి సవరించిన నీట్ ర్యాంకుల జాబితాను ఎన్‌టీఏ విడుదల చేసింది. ఈ క్రమంలోనే అక్రమాల ఆరోపణలపై కేంద్రం, ఎన్‌టీఏ శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్లు సమర్పించాయి. నీట్–యూజీ పరీక్షను రద్దు చేయడం వల్ల నిజాయతీ కలిగిన లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని కేంద్రం సుప్రీంకోర్టు (÷ూబూస।ప। అనీబీసబి)కు తెలిపింది. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు రుజువులు లేనప్పుడు ఆ చర్య చేపట్టడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్లపై జులై 8న తదుపరి విచారణ జరగనుంది. ఈ పరిణామాల వేళ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయడం గమనార్హం.

# నియోజకవర్గానికో నాలెడ్జ్ సెంటర్

వాటర్ సప్లై కార్పొరేషన్‌తో అన్ని ఆవాసాలను అనుసంధానం చేయాలని మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. మిగిలిపోయిన అన్ని ఆవాసాలకు రక్షిత మంచి నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అడవుల్లో నివసించే ప్రజలకు సైతం కుళాయి నీళ్లు అందించాలని ఆదేశించారు.అడవుల్లో విద్యుత్ లైన్లు వేసేందుకు కేంద్ర అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని, అడవుల్లో ఉన్న ఆవాసాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బోర్ల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. నీటి సోర్స్ పాయింట్లు దగ్గర్లో ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామపంచాయతీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు శుభ్ర పరచాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటినీ వినియోగించే విధంగా ప్రజలకు నమ్మకం కలిగించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కాగా.. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నివేదించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 51 వేల కోట్ల బడ్జెట్‌ను పీఆర్ అండ్ ఆర్డీ ప్రతిపాదించింది. గత బడ్జెట్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.23 వేల కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. చేయూత కింద పింఛన్ల మొత్తాన్ని పెంచాలని పీఆర్ అండ్ ఆర్డీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. చేయూత పథకం కోసం 22 వేల కోట్లు అవసరం అవుతాయని అంచన వేశారు. ప్రస్తుతం ఆసరా పెన్షన్ల కోసం రూ. 12 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. గ్రామీణ రహదారుల బ్జడెట్‌ను రెట్టింపు చేయాలని ప్రతిపాదించారు. మహిళా స్వయం సంఘాల లోన్ బీమా, ప్రమాద బీమా కోసం అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# 22నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

బడ్జెట్ సమర్పించారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.
పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బడ్జెట్ సమర్పణ తేదీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారంనాడు ప్రకటించారు. జూలై 22వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని,బడ్జెట్ సమావేశాల రెండో రోజైన జూలై 23న కేంద్రబడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం సిఫారసుల మేరకు పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు జరిపేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. 2024–25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23వతేదీన లోక్‌సకు సమర్పిస్తాం' అని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. ఈసారి బడ్జెట్‌లో పలు చారిత్రక నిర్ణయాలు తీసుకోనున్నారనే అంచనాలు కూడా బలంగానే ఉన్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# తెలుగు రాష్ట్రాల సమస్యలపై సత్వరం స్పందించాలి

పేరుకు ఎన్‌డిఎ ప్రభుత్వం అయినా పూర్తి మెజార్టీతో బిజెపికి ఉండడంతో గత పదేళ్లుగా బిజెపి చెప్పిన విధంగానే ప్రభుత్వం నడిచింది. ఇంతకాలం దాని మాటే సాగుతూ వచ్చింది. అయితే ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలది పైచేయిగా ఉంది. ఈ క్రమంలో బడ్జెట్‌కు ముందు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు, మంత్రులు ప్రధాని మోడీ సహా, కేంద్రమంత్రులను కలిశారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. విభజన సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. తెలంగాణ పరిస్థితి ఎలా ఉన్నా ఎపి సిఎం చంద్రబాబు మాటకు విలువ ఇస్తారా లేదా అన్నది చూడాలి. నష్టపోయిన ఎపిని ఆదుకోవాలని చంద్రబాబు అభ్యర్థిం చారు. గత రెండ్రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన చంద్రబాబు ప్రధాని మోడీ, నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, నడ్డా తదితరులను కలిసి ఎపికి ఇతోధిక సాయం అందించాలని కోరారు. ఇదే తరహాలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించారు. ఇలాంటి విషయాల్లో ఇక దాటవేత ధోరణులు పనికిరాదు. నేరుగ ఆసాయం అందించాలి. ఇరు తెలుగు రాష్ట్రాల పురోగతికి తోడ్పడాలి. ఇంతకుముందు మిత్రపక్షాలుగా ఉన్న కొన్ని పార్టీలు కేవలం నామమాత్రంగా ప్రభుత్వంలో కొనసాగాయి. దీంతో మోడీ నిర్ణయాలను ప్రశ్నించ లేక పోయారు. ఇప్పుడలా ఉంటుందా లేదా అన్నది త్వరలోనే తేలనుంది. బడ్జెట్ కేటాయింపులతో పాటు, రాష్ట్రాలు ప్రతిపాదించే అంశాలకు ఏ మేరకు విలువ ఇస్తారన్నది కూడా చూడాలి. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రధాని మోడీని, కేంద్ర మంత్రులను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు. ఇవి ఏ మేరకు అమలు చేస్తారన్నది కూడా చూడాలి. గతంలో ఎన్‌డిఎ పక్షాల సమావేశాలు..చర్చలు ఉండేవి. వాజ్‌పేయ్ హయాంలో అన్ని పక్షాలను కలుపుకుని పోయే అవకాశం ఉండేది. పార్టీలో కూడా చర్చలు ఉండేవి. కానీ మోడీ పగ్గాలు చేపట్టాక గత పదేళ్లలో అలాంటి అవకాశం లేదు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏకపక్ష నిర్ణయాలపై ఎవరిని అడగాలో ఎవరికీ తెలియదు. పూర్తి మెజార్టీతో నరేంద్రమోడీ అధికారం చేపట్టిన తరవాత పదేళ్లుగా ఎన్‌డిఎ పార్టీలకు సంకటంగా మారింది. సొంత పార్టీలోనూ ఆయనను ఎదరించేవారు కరువయ్యారు. దీంతో ప్రధానిగా మోడీ నిర్ణయాలు తీసుకుం టున్నారే తప్ప వాటి పర్యవసానాలను పరిశీలించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించుకోకుండా ఆర్థిక సంస్కరణల పేరుతో బురిడీ కొట్టించారు. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలది కొంత మెరుగ్గా ఉంది. వారికి ప్రశ్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎపి సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నిలదీసే అవాకాశం ఉంది. నితీశ్ కుమార్‌కు కూడా అంతే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాలు ప్రతిపాదించే అంశాలను మోడీ ఎలా పరిష్కరిస్తారో చూడాలి. అమరావతి నిర్మాణం, పోలవరం, విశ్వాఖ ఉక్కు ఫ్యాక్టరీల విషయంలో వ్యూహం ఎలా ఉండబోతున్నదేది చూడాలి. మోడీ ఏకపక్ష నిర్ణయాల కారణంగానే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా తీర్పు ఇచ్చారు. అయితే తనకు బలముందున్న ధోరణి ప్రవర్తిస్తే ప్రజలు తమకు సమయం వచ్చినప్పుడు తమ నిర్ణయం తీసుకంటారని రుజువు చేశారు. దేశంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యక్తిగతంగా నష్టపోయే ప్రమాదేమీ మోడీకి లేక˘పోవచ్చు. ఇలా ఒంటెద్దు పోకడలతో పోతే నష్టపోయేది బిజెపి మాత్రమే. నియంతృత్వ పోకడలు విడనాడకుంటే వాజ్‌పేయి, అద్వానీ లాంటి అతిరథ మహారథులు తీర్చిదిద్దిన బిజెపికి ఎదురీత తప్పకపోవచ్చు. తెలంగాణలో బిజెపిని వ్యతిరేకించే వారు మళ్లీ కాంగ్రెస్ పంచన చేరుతున్నాయని, వ్యక్తులు కూడా చేరుతారని గమనించాలి. పప్పు ముద్దంటూ రాహుల్ ను ఇంతకాలం విమర్శిస్తూ వచ్చిన నేతలకు కర్నాటక ఫలితాలు చెంపదెబ్బకొట్టి చూపాయి. ఈ ప్రమాదాలను బిజెపి ద్వయం గుర్తించడం లేదు. ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ పోవడం కన్నా ప్రజలను గుర్తించి పనిచేసుకుంటూ పోవాలి. ఇకపోతే పెడ ధోరణిలో మోడీ కూడా మిత్రపక్షాలను పెద్దగా పట్టించుకోకపోతే ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఇక నుంచయినా ఎన్‌డిఎ పక్షాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై గతంలో టీడీపీ అసంతృప్తి వ్యక్తం చేసినా దానికి తగ్గట్లుగా కార్యాచరణకు దిగ˘లేదు. వాజపేయి హయాంలో ఎన్డీఏ నిర్మాణం జరిగినా అప్పుడు రాష్ట్రాలకు విలువ ఉండేది. కానీ మోదీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలకు అవకాశాలు దక్కడం లేదు. ప్రధాని మోదీ అనుసరి స్తున్న నిరంకుశ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. విపక్షాలు ఏకతాటిపైకి రావడంతో బీజేపీకి కొంత బలం తగ్గింది. పూర్తిస్థాయి మెజార్టీని సంపాదించుకోలేక పోయింది. ఏపీ విభజన జరిగినపుడు ప్రత్యేక హోదా కల్పిస్తామని పార్లమెంటు వేదికపైనే వాగ్దానం చేశారు. దాన్ని అమలు చేయకపోవడం సరైనది కాదు. బీజేపీ సంకీర్ణ ధర్మాన్ని పాటించకుండా బెదరింపు ధోరణిలో ప్రవర్తించింది. మోడీ వ్యవహార శైలి ఇలాగే ఉంటే దేశంలో బిజెపికి ఎదురీత తప్పకపోవచ్చు. అందువల్ల ఇప్పుడు రాష్ట్రాలను, ఎన్‌డిఎ పక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.. ఇరు రాష్ట్రాల సిఎంలు ఇచ్చిన వినతి పత్రాలపై సత్వర చర్యలు తీసుకోవాలి. అది రాష్ట్రాల పురోగతిలో ప్రభావం చూపగలదు. అందుకు మోడీ వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి.

# బయోస్ఫియర్ రిజర్వ్‌లు జీవవైవిధ్యానికి నిలయాలు

**(5 జూలై 2024న యునెస్కో 11 కొత్త బయోస్పియర్ రిజర్వ్‌లును ప్రకటించిన సందర్భంగా)**





మనం నివసించే ప్రదేశంలో చుట్టూ వుండే పరిసరాలని దీనిలో వుండే జీవ, నిర్జీవ అంశాలను పర్యావరణం అని అంటారు. భూగోళాన్ని ఆవరించుకొని జీవానికి ఆధారం కల్పించే పలుచని మండలాన్ని బయోస్పియర్ లేదా జీవావరణం అంటారు.

కొత్తగా 11 బయోస్పియర్ రిజర్వ్‌లు:

5 జూలై 2024 న యునెస్కో 11 దేశాలలో 11 కొత్త బయోస్పియర్ రిజర్వ్‌ల హోదాను ఆమోదించింది. వీటిలో మొదటిసారిగా బెల్జియం, గాంబియాల నుండి రెండు ట్రాన్స్‌బౌండరీ బయోస్పియర్ రిజర్వ్‌లు ఉన్నాయి. మిగిలినవి కొలంబియా, డొమినికన్ రిపబ్లిక్, ఇటలీ, మంగోలియా, నెదర్లాండ్స్ రాజ్యం, ఫిలిప్పీన్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, స్లోవేనియా, స్పెయిన్‌లో ఉన్నాయి. ఈ కొత్త బయోస్పియర్ రిజర్వ్‌లు మొత్తం 37,400 చ.కి.మీ వైశాల్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది నెదర్లాండ్స్ దేశం పరిమాణానికి సమానం. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు 136 దేశాలలో మొత్తం 759 బయోస్పియర్ రిజర్వ్‌లు ఉన్నాయి. అభివృద్ధి, పరిరక్షణ మధ్య సంఘర్షణను తగ్గించడానికి యునెస్కో సహజ ప్రాంతాలకు 'బయోస్పియర్ రిజర్వ్' హోదాను ప్రవేశపెట్టింది. స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి బయోస్పియర్ రిజర్వ్‌లను మ్యాన్ అండ్ బయోస్పియర్ రిజర్వ్ ప్రోగ్రాం గుర్తించింది. ఈ కార్యక్రమాన్ని యునెస్కో 1971లో ప్రారంభించింది.

బయోస్పియర్ రిజర్వ్ అంటే..?

ప్రపంచంలోని మొదటి బయోస్పియర్ రిజర్వ్ 1979లో గుర్తించబడింది. బయోస్పియర్ రిజర్వ్‌లు జీవవైవిధ్యం యొక్క పెద్ద ప్రాంతాలు. ఇక్కడ జంతుజాలం ?? వృక్షజాలం రక్షించబడతాయి. ఈ రిజర్వ్‌లలో భూమి, సముద్ర, తీరప్రాంత సంబంధమైన పర్యావరణ వ్యవస్థలు ఉన్నాయి.వీటికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంటుంది. ఇవి సామాజిక అభివృద్ధి, ఆర్థిక సాంస్కృతిక విలువల నిర్వహణ ప్రకృతి సంరక్షణను సమతుల్యం చేయడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, బయోస్పియర్ రిజర్వ్ ఏ చట్టం పరిధిలోకి రాదు. 2030 నాటికి భూమి యొక్క పర్యావరణ వ్యవస్థలలోని ముఖ్యమైన భాగాలను రక్షించడం మరియు పునరుద్ధరించడంపై కున్మింగ్ మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా నిర్దేశించబడిన ప్రపంచ అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఇవి సహాయపడతాయి. బయోస్పియర్ రిజర్వ్ లో మూడు జోన్లు ఉంటాయి. కోర్ జోన్లో మానవ కార్యకలాపాలకు అనుమతి లేదు. బఫర్ జోన్లో వనరుల సేకరణ కోసం స్థానిక వ్యక్తులకు మాత్రమే పరిమితంగా అందుబాటుకు అనుమతి ఉంటుంది. ఫ్రీ జోన్ అనేది బయటి జోన్. ఇది మానవ నివాసాలకు, వనరుల సేకరణకు తెరిచి ఉంటుంది.

బయోస్పియర్ రిజర్వ్‌ల ఉపయోగాలు:

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 27.5 కోట్ల మంది బయోస్పియర్ రిజర్వ్‌లలో నివసిస్తున్నారు. ఇవి నివాసులను ప్రభావితం చేయకుండా జాతులు, పర్యావరణ వ్యవస్థలు, జన్యు వైవిధ్యాలు, ప్రకృతి దృశ్యాలను సంరక్షిస్తాయి. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరిణామాలతో సహా స్థిరమైన అభివృద్ధిని నిర్ధారిస్తుంది. పర్యావరణ వ్యవస్థల ఆవాసాలకు సంభవించే ఏదైనా నష్టాన్ని పునరుద్ధరిస్తాయి. ఈ ప్రాంతాలు పర్యావరణ వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలి, సంరక్షించాలి, అభివృద్ధి చేయాలి అనే దానిపై చాలా సమాచారాన్ని అందిస్తాయి. మానవ కార్యకలాపాల వల్ల ప్రభావితమైన ప్రకృతి దృశ్యాలను పునఃసృష్టి చేయడానికి పరిశోధనలు మార్గాలను అందిస్తాయి. ఈ ప్రాంతాలలో కనిపించే భూ యజమానులు, ప్రభుత్వ సంస్థలు, రైతులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమలు పరిరక్షణ సమూహాలు సమగ్రమైన భూ నిర్వహణ కోసం కలిసి పని చేయవచ్చు. నేల కోతను అరికట్టడం, నీటి బుగ్గలను రక్షించడం, నేల నాణ్యతను కాపాడేందుకు డికంపోజర్లను నిర్వహించడం ద్వారా ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్వహించడంలో ఇవి సహాయపడతాయి. మానవులు ప్రకృతి ఎలా సహజీవనం చేయవచ్చనే దానికి ఇవి సజీవ ఉదాహరణలు .

హోదా కోసం ప్రమాణాలు:

ఒక సైట్ తప్పనిసరిగా పరిరక్షణ అంతరాయ విలువ కనిష్టంగా ఉండే ప్రధాన ప్రాంతాన్ని కలిగి ఉండాలి. ఇది స్థిరమైన నిర్వహణ పద్ధతులకు, పరిశోధన ప్రదర్శనకు అనువైన భూమి, నీటిని కలిగి ఉండాలి. కోర్ ఏరియా తప్పనిసరిగా అన్ని స్థాయిలలో ఆచరణీయ జనాభాకు మద్దతు ఇచ్చేంత పెద్ద బయో భౌగోళిక యూనిట్ అవుతూ అరుదైన అంతరించిపోతున్న జాతుల ఆవాసాలును కల్గి ఉండాలి. జీవవైవిధ్య పరిరక్షణలో స్థానిక సంఘాల భాగస్వామ్యం, వారి జ్ఞానాన్ని ఉపయోగించేటట్లుగాను, పర్యావరణం యొక్క సామరస్య ఉపయోగం కోసం సాంప్రదాయ గిరిజన లేదా గ్రామీణ జీవన విధానాలను సంరక్షించే అవకాశం ఉన్న ప్రాంతాలుగా ఉండాలి.

మనదేశంలో బయోస్పియర్ రిజర్వ్‌లు:

భారతదేశంలో పద్దెనిమిది బయోస్పియర్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఇందులో పన్నెండు యునెస్కో బయోస్పియర్ రిజర్వ్‌లు. నీలగిరి బయోస్పియర్ రిజర్వ్ మన దేశంలో మొట్ట మొదటిది. ఇది 01 సెప్టెంబర్ 1986న నోటిఫై చేయబడింది. గ్రేట్ రాన్ ఆఫ్ కచ్ భారతదేశంలో అతిపెద్ద బయోస్పియర్ రిజర్వ్.

గుజరాత్‌లో ఉన్న గ్రేట్ రాన్ ఆఫ్ కచ్ బయోస్పియర్ రిజర్వ్ ఉప్పు చిత్తడి నేలలు, ప్రత్యేకమైన పర్యావరణ వ్యవస్థలకు ప్రసిద్ధి చెందిన మంత్రముగ్ధులను చేసే ప్రకృతి దృశ్యం. 12,454 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇది 2008లో బయోస్పియర్ రిజర్వ్‌గా మారింది. ఈ ప్రాంతం స్థానిక కమ్యూనిటీల సాంప్రదాయ చేతిపనులు, సంగీతాన్ని ప్రదర్శించే ప్రఖ్యాత రాన్ ఉత్సవ్, సంస్కృతి యొక్క శక్తివంతమైన వేడుకను నిర్వహిస్తుంది. బయోస్పియర్ రిజర్వ్ వన్యప్రాణుల ఔత్సాహికులకు ఒక స్వర్గధామం. అంతరించిపోతున్న భారతీయ అడవి గాడిద యొక్క సంగ్రహావలోకనాలను అందిస్తుంది. వివిధ వలస పక్షులకు కీలకమైన ఆవాసంగా పనిచేస్తుంది. అతి చిన్నది డిబ్రూ-సైఖోవా. ఇది
765 చ.కి.మీ వైశాల్యం ఉంది.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# కీర్తిచక్ర' పొందిన మొదటి సైనికేతరుడు వాడపల్లి



**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**



భారత దేశంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా బహూకరించే అత్యున్నత పురస్కారాలలో 'కీర్తిచక్ర' రెండవది. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు మాత్రమే ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం అది. అయితే... ఓ సైనికేతర పౌరుడైన వాడిపల్లి వెంకటేశ్వరరావు మొట్ట మొదటి సారిగా ఆ పురస్కారాన్ని పొందడం వెనుక...ఆయన చేపట్టిన పదవీ బాధ్యతలు, అందించిన సేవలు, అన్నింటినీ మించి త్యాగనిరతి కారణాలు.

భారతదేశంలో కీర్తిచక్ర పొందిన మొట్టమొదటి సైనికేతర పౌరుడైన వి.వి. రావు గా వాసికెక్కిన వాడపల్లి వెంకటేశ్వరరావు (ఆగష్టు 26, 1963 – జూలై 7, 2008)

1963 ఆగష్టు 26వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామంలో వాడపల్లి అప్పలాచార్యులు, సుభద్ర దంపతులకు జన్మించారు. పుట్టిన చోటే ఎస్.ఎస్.సి. వరకు చదివిన ఆయన.. ఎ.పి.ఆర్.జె.సి. నాగార్జున సాగర్ లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు.సివిల్ సర్వీసెస్ లో టాపర్ గా నిలవడమే తన ధ్యేయమని తన సిల్వర్ జూబ్లీ కళాశాల మిత్రులతో వి.వి.రావు చెప్పడం వల్ల అందరూ వి.వి.రావును పేరుతో కాకుండా "టాపర్" అని పిలిచేవారు. వాడ్రేవు చినవీరభద్రుడు కూడా ఆయన సహాధ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండే ఆయన.. ప్రవేశ పరీక్ష రాసి, తద్వారా కర్నూలులో వుండే సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎ.గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1983 నుండి 1985 సం.లో హైదరాబాదులోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం నుండి ఎం.ఫిల్ పూర్తి చేశారు. తర్వాత అదే విశ్వ విద్యాలయం నుండి ఆసియా దేశాలతో భారతీయ సంబంధాలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించారు.

వెంటనే 1990 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరై ఆప్షంస్ లో ఐ.పి.ఎస్./ఐ.ఎఫ్.ఎస్. లకు అవకాశం వుండగా ప్రపంచ దేశాలతో భారత సంబంధాలపై పరిశోధన ద్వారా మంచి పట్టు వుండడంతో, రిటైర్డ్ హెల్త్ ఎక్స్ టెన్షన్ అధికారి అయిన తండ్రి వాడపల్లి అప్పలాచార్యులు
సూచన ద్వారా ఇండియన్ ఫారిన్ సర్వీస్ ను ఎంపిక చేసుకున్నారు.

తొలుత ఆయన జర్మనీలోని భారత రాయభార కార్యాలయంలో ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత శ్రీలంక, నేపాల్, భూటాన్, ఇండియా, అమెరికా వంటి దేశాలలో 1990 నుండి 2005 వరకు పనిచేశారు. ఆఫ్ఘనిస్తాన్ లోని రాయబార కార్యాలయంలో పని చేయడానికి చాలా మంది అయిష్టత వ్యక్తం చేయడంతో... ఆ స్థితిలో భారత ప్రభుత్వం ఆ పదవికి వి.వి.రావును నిర్ణయించింది. విధి నిర్వహణలో మంచి పట్టుదల, సమర్ధత కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన ఆయన.. ప్రభుత్వం తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేకించి సవాలుగా తీసుకొని అక్కడ విధులలో చేరారు.

అక్కడి కాబూల్ లోని భారత రాయబార కార్యాలయంలో కన్సులేట్ గా 3 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్ఘనిస్తాన్ లోని ముఖ్యమైన భాషలలో ఒకటైన "దారి" భాషలో చక్కటి పట్టువున్న వి.వి.రావు భారత్, ఆఫ్ఘన్ ఇరుదేశాల సంబంధాలను, మైత్రీ బంధాన్ని ఇనుమడింప జేశారు. 2008 జూలై 7వ తేదీన కాబూల్ లోని భారత రాయబార కార్యాలయం ముందు జరిగిన తీవ్రవాదుల ఆత్మాహుతి దాడిలో మొత్తం 41 మంది మృతి చెందగా... ఆ దూరదృష్ట అవాంఛిత దుర్ఘటనలో భారత రక్షణ విభాగానికి చెందిన బ్రిగేడియర్ మెహతాతో పాటు మరో ముగ్గురు కార్యాలయ సిబ్బంది మరణించారు. అలా మరణించిన వారితో పాటుగా, భారతీయ దౌత్యవేత్త అయిన 44 యేళ్ళ వాడపల్లి వెంకటేశ్వరరావు కూడా వున్నారు. ఆ విధంగా విధి నిర్వహణలో అసువులు బాసి, అమరులైన ఆయనకు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన సైనికాధికారులకు ఇచ్చే కీర్తిచక్ర పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ విధంగా కీర్తిచక్రతో గౌరవించబడిన మొట్టమొదటి సైనికేతర భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. వి.వి.రావు పదవికి సమానమైన హోదా కలిగిన భారతీయ సాంస్కృతిక సంస్థ, బ్యాంకాక్ కు డైరెక్టర్ గా పదవీ బాధ్యతలను ఆయన ధర్మపత్ని వాడపల్లి మాలతీరావుకు భారత ప్రభుత్వం అప్పగించి గౌరవించింది.

# కవిత్వం

## తప్పెవరిది...?
## బాధ్యులెవరు..?

ఎవరో తింటే మన
ఆకలి తీరుతుందా..?
ఎవరో స్నానం చేస్తే
మన మురికిపోతుందా..?

కష్టపడితేనే కదా
కడుపు నిండేది
డాక్టర్లను సంప్రదిస్తేనే
కదా రోగాలు తగ్గేది...?
మందులేసుకుంటేనేకదా
మొండివ్యాధులు

నయమయ్యేది..?

తాముజి
దైవస్వరూపులమని...
మాయమాటలతోజి
ప్రజలను మభ్యపెట్టే...
తమకు మానవాతీత
శక్తులున్నాయని భ్రమపెట్టే
ఈ దొంగ బాబాలను
ఎందుకు నమ్ముతారో
ఈ పిచ్చి ఈ వెర్రి
ఈ అమాయకపు
ఈ అజ్ఞానపు జనం...

ఎప్పుడంతమయ్యేను.
ఈ మూఢాచారాలు...?
ఈ మూఢనమ్మకాలు...?
ఎప్పుడు ఈ అమాయకపు
భక్తులకు జ్ఞానోదయమయ్యేను..?

ఎప్పుడు వీరికి కనువిప్పు కలిగేను..?
ఎప్పుడు వీరిలో చైతన్యం
రగిలేను..?
ఎప్పుడు అజ్ఞానాంధకారం
తొలిగేను..?
ఎప్పుడు ఈ చీకటి జీవితాలు
వెలిగేను..?

భక్తి ముసుగులో అక్రమాలకు
పాల్పడే
ఈ దొంగ బాబాల భరతం
పట్టేదెవరు..?
ఈ ఘోర విషాదానికి
బాధ్యులెవరు....?

రచన:
"కవిరత్న"
"సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

## పొలిట్రిక్స్

పెట్రోలు, డీజిల్ రెక్కలు
విరుస్తారట పెద్దలు,
డబుల్ ఇంజెన్ చేసినాక
ట్రాఫిక్ జరిమానాలు !
బెత్తెడు దయ జూపి
మూరెడంత నొక్కేసుడు,
అదే భాగ్యమనుకుంటే పొరపాటే
మనోడు !

న్యాలకంటి నారాయణ
9346200066

## ఇది భారత్ ప్రపంచకప్

కోట్ల మంది భారతీయుల ఆశలతో
ఏళ్ళ తరబడి నిరీక్షణతో
కప్ కొట్టాలనే లక్ష్యంతో
మైదానంలో అడుగు పెట్టి
అంచనాలున్నా ఎక్కడో భయంశా.
కానీ సభ్యులందరి సంచలన
ప్రదర్శనతో
ఓటమెరుగని జట్టుగా
వరుస విజయాలతో ఫైనల్ కి
దూసుకొచ్చి
సఫారీలకి ఎదురునిల్చి
బ్యాట్ తో లక్ష్యాన్ని నిర్దేశించి
బంతితో ప్రత్యర్థిని కట్టడి చేసి
రోహిత్ నాయకత్వంలో
విరాట్ పోరాట పటిమతో
బుమ్రా వికెట్ల వేటతో
సూర్య ఒడిసి పట్టిన క్యాచ్ తో
వెరసి భారత్ ఖాతాలో మరో
ప్రపంచకప్
కోట్ల మంది భారతీయులు
ఆనందంలో మునిగి ఉన్న వేళ
దిగ్గజాల నిష్క్రమణతో
బాధని మిగిల్చి
జట్టులోని సభ్యులందరి సమిష్టి కృషితో
భారత్ కి ప్రపంచకప్ అందించిన
టీమ్ ఇండియాకి
ఇవే మా నీరాజనాలు

కోనేటి నరేష్,
8499847863

## కాపాడుకుందాం ..

అనగనగా ఒక చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామానికి ఆనుకుని దగ్గరలో అడవి ఉండేది. గ్రామంలో రంగయ్య అనే ఒక వ్యక్తి ఉండేవాడు. రంగయ్య రోజు ప్రక్కనున్న అడవిలోకి పోయి చెట్లను కొట్టి ఆ కట్టెలను మూటగట్టుకుని కొద్ది దూరంలోనున్న పెద్దపట్నంలో అమ్మేవాడు.

కొంతకాలానికి ఆ అడవిలోని చెట్లు తగ్గిపోయాయి. అడవి జంతువులు పంటపొలాలలోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. ఊర్లోకి వచ్చి ఊరిప్రజలను భయపెడుతున్నాయి.

ఇదిలా ఉండగా ఒకరోజు రంగయ్య గొడ్డలిపట్టుకుని ఇంట్లోంచి బయటపడి నడచుకుంటూ అడవికి బయలుదేరాడు. దారిలో ఆరవతరగతి చదువుతున్న హర్ష ఎదురుపడ్డాడు.



"తాతా! ఎటు పోతున్నావు?" అని అడిగాడు. దానికి రంగయ్య "అడివికి పోతున్నా బిడ్డా! కట్టెలు కొట్టుకుని పట్నం బోయి అమ్ముకొస్తా!" అని జవాబిచ్చాడు. అప్పుడు హర్ష "ఓ పిచ్చితాతా! అందరు నీలాగా అడవిలోని చెట్లను కొట్టేయడం వల్లనే అడవిలోని జంతువులు ఊర్లోకి వస్తున్నాయి. చెట్లు కార్బన్ డై ఆక్సయిడ్ పీల్చుకుని మనకు అవసరమైన ఆక్సిజన్ ఇస్తాయని మా సైన్స్ సార్ చెప్పిండు. మంచిగాలి కావాలంటే చెట్లు ఉండాలి తాతా!" అన్నాడు.

దానికి రంగయ్య "బిడ్డా! బడికిపోయి మంచి ముచ్చట్లు నేర్చుకున్నవ్! ఇప్పటినుండి నేను చెట్లను కొట్టేయ! ఇంకోళ్ళను కొట్టనియ్య! అవుసరానికి కొట్టినా కొత్తగా ఒకటికి రెండు చెట్లను బెంచుతా!" అని హర్షను దగ్గరకు తీసుకున్నాడు.

ముస్త్యాల దినకర్
ఆరవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నరసాయపల్లి, సిద్ధిపేట




# ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం

- విరిగిపడ్డ కొండ చరియలు
- ఇద్దరు హైదరాబాదీలమృతి
- అస్సాం అతలాకుతలం..
- ఉప్పొంగుతున్న నదులు

నైనిటాల్ (ప్రజా మంటలు): దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. చమోలీ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికులు మృతిచెందినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. కర్ణప్రయాగ, గౌచర్ మధ్యలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన నిర్మల్ షాహీ (36), సత్య నారాయణ (50) బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని బైక్‌పై తిరిగొస్తుండగా.. మార్గమధ్యంలో కొండచరియలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను శిథిలాల నుంచి బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్ వ్యాప్తంగా ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అటు కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ నేషనల్ హైవే పలు చోట్ల ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రప్రయాగ్-కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై కూడా రాకపోకలను నిలిచాయి. శని, ఆదివారాల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ముందజాగ్రత్త చర్యగా రుద్రప్రయాగ్‌లో అన్ని స్కూళ్లకు నేడు సెలవు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.









**అస్సాం అతలాకుతలం..**

ఈశాన్య రాష్ట్రం అస్సాం లో వరదల బీభత్సం ఇంకా కొనసాగుతోంది. బ్రహ్మపుత్ర నది దాని ఉప నదులు ఉప్పొంగుతున్నాయి. డేంజర్ మార్కును దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వరదలతో 24 లక్షల మంది ప్రభావితమయ్యారు. నిమతి ఘాట్, గువాహటి, గోల్పరా, ధుబ్రి ప్రాంతాల్లో బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. దాని ఉపనదులైన బుర్హి దిహింగ్, డికౌ, దిసాంగ్, ధన్‌సిరి, జియా భరాలి, కొపిలి కూడా గ్రామాలను అతలాకుతలం చేస్తున్నాయి. కమ్రూప్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఓ చిన్నారి కూడా ఉండడం బాధాకరం. వరదలు, కొండచరియలు విరిగిపడడం, తుపానుల కారణంగా ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 64కి చేరింది. వేల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. వరదల కారణంగా 63,490 హెక్టార్ల పంట భూమి నీట మునిగింది. అత్యధికంగా ధుబ్రి జిల్లాలో 7 లక్షల మందికి పైగా ప్రభావితమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత దర్రాంగ్‌లో 1,86,108.. బార్పేటలో 1,39,399.. మెరిగావ్‌లో 1,46,045 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 47,103 మంది వరద బాధితులు 612 సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది రాష్ట్రంలో ఆరుసార్లు వరదలు సంభవించాయి. వరదల కారణంగా కజిరంగా నేషనల్ పార్క్‌లో ఇప్పటివరకు 31 జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ దిబ్రూగఢ్‌లోని పరిస్థితిని సమీక్షించారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని.. అందరిని కాపాడేందుకు ప్రభుత్వం శ్రమిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మృణాల్ సైకియా తన మొబైల్ కిచెన్ ద్వారా వరద బాధితులకు ఆహారాన్ని సరఫరా చేస్తున్నారు.

# విశాఖ ఉక్కుపై స్థానిక బిజెపి పోరాడాలి

**కేంద్ర నిర్ణయం అమలు కాకుండా చూడాలి**

**కార్మిక సంఘాలు, నేతల డిమాండ్**

విశాఖపట్టణం,జూలై6 (ప్రజా మంటలు): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వెళ్తుండగా, అదే స్థాయిలో కార్మికవర్గం ప్రతిఘటన ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. గత ఐదేళ్లుగ ఆప ఓరాటాలు చేశారు. దీనిని అడ్డుకునేందుకు అన్ని పార్టీలు పోరాటం చేస్తున్నాయి. కార్మిక సంఘాలు ఈ విషయంలో ముందున్నాయి. కేంద్రం కార్య రంగంలోకి దిగకుండా సమిష్టిగా పోరాడాయి. ఇప్పుడు ఎపిలో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో పాటు, బిజెపి కూడా భాగస్వామి కావడంతో ఇక బిజెపిపై పెద్ద బాధ్యత ఉంది. ప్రైవేటీకరణ పక్రియ సాఫీగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేళ బిజెపి నేతలు దీనిని అడ్డుకోవాలి. ప్రజల ఆందోళనలు పట్టించుకోకుండా ముందుకే వెళ్లాలన్న పట్టుదలతో వెలితే ఎదురుదాడి తప్పక పోవచ్చు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలను కొనసాగిస్తూనే ఉన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నిరసనలు తెలుపుతున్నారు. మరోవైపు కార్మికుల నిరాహారదీక్షలు సాగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం వేడెక్కుతోంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా పోరాట కమిటీ సమాయత్త మవుతోంది. వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో ర్యాలీ నిర్వహించి తమ నిరసనలు తెలియచేస్తూనే ఉంది. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేస్తున్న పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరించాలని కార్మికవర్గం కోరుతోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఉద్యమం లో పాల్గొనాలని, రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా పార్లమెంట్‌లో ఉక్కు ప్రైవేటీకరణ అంశం లెవనెత్తి, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే విధంగా ఒత్తిడి తేవాలని పోరాట కమిటీ విజ్ఞప్తి చేసింది. ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్ణయాలతో ఉద్యోగులు, కార్మికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎట్టి పరిస్థితు ల్లోనూ ప్రైవేటీకరణను అంగీకరించబోమని నినదిం చాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన వెలువడిన మరుక్షణం నుంచే ఇక్కడ ఉద్యమం ప్రారంభమయింది. ఉక్కు కార్మిక సంఘాలు, వివిధ అసోసియే షన్లు, అధికారుల సంఘాలు కలసి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడ్డారు. రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ప్లాంట్ ప్రైవేటీకరణపై పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనతో జాతీయ రహదారి దిగ్బంధం లాంటి కార్యక్రమాలు నిర్వహించిన తమ నిరసన తెలిపారు. ప్రైవేటీకరణ కు వ్యతిరేకం గా ఆందోళనలు కొనసాగు తున్నా కేంద్రం పట్టించుకోకుండా సలహాదారుల ప్రకటన చేయడంతో పోరాట కమిటీ భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తోంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోను ఆందోళనలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి రాజకీయ ప్రముఖులను కలిసి మద్దతు కూడగడతామని తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన, ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ను కేంద్రం తెగ నమ్ముతంటే ఎలా చూస్తూ ఊరుకుంటారని మండిపడ్డారు. విశాఖ కోసం అవసరమైతే బిజెపి నేతలు పదవులు వదలుకోవాలని సిపిఐ నేత రామకృష్ణ అన్నారు. అప్పుడే విశాఖ ఉక్కును కాపాడుకోగలమని అన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకునే శక్తి వారికే ఉందని చొరవ తీసుకోవాలని, లేకపోతే పశ్చాత్తాపపడాల్సి వస్తుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకునేంతవరకు కార్యాచరణ ఉండాల్సిందేనని ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యక్ష పోరాటం చేయాలన్నారు.



## 'మెదడును తినే అమీబా'..

**- కేరళలో మరో కేసు నమోదు**

**- మొత్తం నలుగురికి సోకిన వైరస్**

కోజికోడ్ (ప్రజా మంటలు): 'మెదడును తినే అమీబా అనే అరుదైన వ్యాధి కేరళలో కలకలం సృష్టిస్తోంది. ఈ వ్యాధి బారిన పడి బుధవారం 14 ఏళ్ల మృదుల్ అనే ఓ బాలుడు మృతి చెందగా తాజాగా మరో కేసు నమోదైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. కోజికోడ్ జిల్లాలోని పయోలి ప్రాంతంలో నివసిస్తున్న మరో 14 ఏళ్ల బాలుడికి ఈ వ్యాధి సోకడంతో చికిత్స అందిస్తున్నట్లుగా వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి పరిస్థితి మెరుగవుతోందని వెల్లడించారు. శుక్రవారం ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉన్నత స్థాయి వైద్యాధికారులతో చర్చలు జరిపారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నందున నీటికుంటలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. కలుషిత జలాల్లో ఉండే అమీబా బ్యాక్టీరియా ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించినప్పుడు అమీబిక్ మెనింజో ఎన్‌సెఫలైటిస్ వ్యాధి సోకుతుంది. ఈ ఏడాది మేలో మలప్పురంలో ఐదేళ్ల ఓ బాలిక, జూన్‌లో కన్నూర్‌లో 13 ఏళ్ల మరో బాలిక ఇదే వ్యాధితో మరణించడం గమనార్హం. 2017, 2023ల్లో అలప్పుజ జిల్లాలో అమీబిక్ మెనింజో ఎన్‌సెఫలైటిస్ కేసులు నమోదయ్యాయి.

## ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా మసౌద్ పెజెష్కియాన్

(ప్రజా మంటలు): ఇబ్రహీం రైసీ (63) హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఇరాన్‌లో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు ఎన్నికలు నిర్వహించారు. వాటిలో మసౌద్ పెజెష్కియాన్ విజయం సాధించారు. పిడివాదిగా పేరుపొందిన సయీద్ జలిలితో పోటీపడి గెలుపొందారని ఆ దేశ హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ ఎన్నికలో 30 మిలియన్ల మంది ఓటువేయగా పెజెష్కియాన్‌కు 16 మిలియన్లు.. జలిలికి 13 మిలియన్ల ఓట్లు వచ్చాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. సంస్కరణవాదిగా పేరున్న మసౌద్.. హృద్రోగ నిపుణుడు. ఇరాన్‌ను ఆంక్షల చట్రం నుంచి బయటకు తీసుకురావడానికి పాశ్చాత్య దేశాలతో సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తానని తన ప్రచారంలో పేర్కొన్నారు. ఆయన అభ్యర్థిత్వానికి మాజీ అధ్యక్షులు హసన్ రౌహానీ, మహమ్మద్ ఖాటామి మద్దతు ఉంది. ఇదిలా ఉంటే.. జూన్ చివర్లో అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగింది. అయితే నాటి పోలింగులో దాదాపు 60% మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోకపోవడంతో జులై 5న రెండో బ్యాలెట్ (రన్‌ఆఫ్ పోలింగ్)ను నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఇరాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాల నేపథ్యంలో ఆగ్రహంతో ఉన్న ప్రజలు ఈ ఓటింగ్ పట్ల ఆసక్తి చూపలేదు. ఇద్దరు అభ్యర్థులను, వ్యవస్థను తిరస్కరించడానికే వారు ఇలా చేశారని మునుపటి ఓటింగ్ గురించి రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలైన ఓట్లలో 50% పైగా వచ్చినవారే విజేత అవుతారని ఇరాన్ చట్టాలు చెబుతున్నాయి. అలా రానప్పుడు.. అగ్రస్థానంలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల మధ్య వారం రోజుల తర్వాత రన్‌ఆఫ్ పోలింగ్ నిర్వహించాలి. ఇలా 2005లో ఒకేఒక్కసారి జరిగింది. ఇప్పుడు జరిగింది కూడా రన్‌ఆఫ్ పోలింగే.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

**- ఆర్మీ జవాన్ మృతి**

శ్రీనగర్ (ప్రజా మంటలు): జమ్మూకశ్మీర్‌లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కల్గామ్ జిల్లాలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ జవాన్ అమరవీరుడైనట్లు కశ్మీర్ జోన్ పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలోని మెడెర్గామ్ గ్రామంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు ఆర్మీ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాతంలో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. వీరిని పసిగట్టిన టెర్రరిస్టులు కాల్పులు జరిపారు. జవాన్లు సైతం ఎదురు కాల్పులు జరపడంతో ముగ్గురు ఉగ్రవాదులను వారి రహస్య స్థావరంలో మట్టుబెట్టారు. అయితే ఈ ఎన్‌కౌంటర్ ఓ సైనికులు సైతం ప్రాణాలువిడిచాడు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ట్రాఫిక్ సమస్యపై ఎస్పీకి వినతి



జగిత్యాల జులై 06 (ప్రజామంటలు): జిల్లా కేంద్రం కు చెందిన సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం నూతన ఎస్పీ అశోక్ కుమార్ ని లాంఛనంగా కలిసి ట్రాఫిక్ సమస్యల పై చర్చించారు. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రతి ఒక్కరు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడుపాలని, కుడి ఎడమ లకు వెళ్లేటపుడు ఇండికేటర్ తప్పకుండా వాడాలని, ట్రిబుల్ రైడింగ్, ప్రమాద కారకమవుతుందని, మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని, నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని తవుటు రామచంద్రం ఎస్పీ ని కోరారు.

## బాధిత కుటుంబానికి రూ. 2,30,000 ఎల్.ఓ.సి. ని అందించిన ఏమ్మెల్యే కడియం



వేలేరు జూలై 06 (ప్రజామంటలు): వేలేరు మండల కేంద్రంలోని వేలేర్ గ్రామానికి చెందినబిల్లా విజయలక్ష్మి గారి తోడి కోడలు బిళ్ళ రమేష్ భార్య రాధ కిడ్నీ లివర్ సమస్యతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఇట్టి విషయము వేలేరు మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ కి తెలుపగా వారు కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా వారు మానవతా దృక్పతంతో స్పందించి వారి కుటుంబసభ్యులకు రూ. 2,30,000 ల ఎల్.ఓ.సి. ని అందజేశారు. వీరితో పాటు మల్లికుదుర్ల మాజీ సర్పంచ్ గోదల రాజిరెడ్డి, మహిళా సంఘాల రాష్ట్ర నాయకురాలు పెసరు అరుణ పాల్గొన్నారు.

## కమల నిలయములో ఘనంగా డా. శ్యామ్ ప్రసాద్ జయంతి



జగిత్యాల జులై 06 (ప్రజామంటలు): డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం "కమల నిలయంలో" వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం వారి జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు మొక్కలు నాటిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్, జగిత్యాల రూరల్ మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి, మాజీ పట్టణ అధ్యక్షులు వీరబత్తిని అనిల్ కుమార్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, దీటి వెంకటేష్, మ్యాకల లక్ష్మి, సింగం పద్మ, పుష్ప, భానుప్రియ, మధురిమ, కవిత, లావణ్య మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్




జగిత్యాల జులై 06 (ప్రజామంటలు): పశువులు, జీవాలు, పెంపుడు జంతువులు సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత యాంటీ రేబీస్ టీకాల శిబిరాన్ని జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై టీకా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం పెంపుడు జంతువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించడానికి కుటుంబ నియంత్రణ, వాక్సినేషన్ చేసి వదిలిపెట్టడం కోసం మున్సిపల్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.పశువైద్య సహాయ సంచాలకులు మాట్లాడుతూ ... పశువులు. జీవాలు, పెంపుడు జంతువులకు ఆంత్రాక్స్, బ్రుసెల్లోసిస్ ఆవులు, గేదెలు, కుక్కల ద్వారా లెప్టోస్పిరోసిస్ వ్యాధులు ఇతర జంతువుల నుంచి మనుషులకు సంక్ర మించే ప్రమాదం ఉందన్నారు. ఈ శిబిరంలో భాగంగా 195 ఆంటీ రేబీస్ టీకాలను పెంపుడు కుక్కలకు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రఘువరన్ జిల్లా పశు వైద్యాధికారి జిల్లా అదనపు వైద్యాధికారి జిల్లా వెటర్నరీ అధికారి నరేష్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య 18వ వార్డు కౌన్సిలర్ చుక్క నవీన్ గారు 17వ వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగారావు పాల్గొన్నారు.



జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తన జన్మదినం సందర్భంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ లో వారి నివాసం లో కలిసి నియోజకవర్గ అభివృద్ధి అంశాల పై చర్చించగా జగిత్యాల సమగ్ర అభివృద్ధి కి సహకరిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపిన ఎమ్మెల్యే..

## గ్రానైట్ యజమానుల ఆగడాలకు హద్దులేదు

### పట్టించుకునే అధికారులూ లేరు



ఎల్కతుర్తి జులై 06 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ఓ లారీలో గ్రానైట్ డస్ట్ తరలిస్తుండగా డోర్ ఊడిపోయి మొత్తం రోడ్డు మీద పడిపోయింది. అర కిలోమీటర్ దూరం వరకు డస్ట్ పడిపోవడంతో అటు వైపు వెళ్లే రైతులు, కూలీలను తరలించే ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి ఓ జేసీబీ వచ్చి డస్ట్ ను తొలగించింది. లారీ ఎవరిదో, ఆ జేసీబీ ఎవరిదో తెలియదు. ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతున్నా అడిగే వారే లేకుండా పోయారు. యాజమాన్యాలను అడిగితే పట్టించుకోవడం లేదు. కేవలం రైతుల ఎడ్లబండ్ల బాటను వెడల్పు చేసి, భారీ వాహనాలను నడిపిస్తున్న గ్రానైట్ యజమానులు నెలనెలా రెండున్నర లక్షల రూపాయలు రోడ్డు మరమ్మతులకు ఉపయోగిస్తున్నట్లు లెక్కలు చూపుతున్నారు.

## అభివృద్ధి పనులను వెంటనే చేపట్టండి..

### అధికారులకు ఎమ్మెల్యే తలసాని ఆదేశం



సికింద్రాబాద్ జూలై 06 (ప్రజామంటలు): అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పద్మారావు నగర్ లోని హమాలీ బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించి ఆలయం ఆవరణలో వెంటనే ఫ్లోరింగ్ పనులు చేపట్టి బోనాల ఉత్సవాల నాటికి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్తీలో ఎస్.ఎస్ ఫ్లోరింగ్,డ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరైనాయని, శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ఎందుకు చేపట్టలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఎల్. వెంకటేషన్ రాజు, నాయకులు దుర్గా, కుషాల్, సుభాష్, యాదగిరి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్ పాల్గొన్నారు.

## బోయిగూడ వెటర్నరీ ఆసుపత్రిలో జునోసిస్ డే

### ఉచితంగా పెట్ డాగ్స్, క్యాట్స్ కు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు



సికింద్రాబాద్ జూలై 06 (ప్రజామంటలు): వరల్డ్ జునోసిస్ డే ను పురస్కరించుకొని శనివారం బోయిగూడ వెటర్నరీ ఆసుపత్రిలో పెట్ డాగ్స్, క్యాట్స్ కు ఉచితంగా యాంటీ రేబీస్ వ్యాక్సిన్లను వేశారు. 1885 జూలై 6న ఫ్రెంచ్ సైంటిస్ట్ లూయిస్ పాశ్చర్ తాను కనిపెట్టిన యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ను విజయవంతంగా ప్రయోగించి, ఒక ప్రాణాన్ని కాపాడారని వెటర్నరీ ప్రొఫెసర్, ఇంచార్జీ డా.ఎస్. అయోధ్య తెలిపారు. ఆ చారిత్రాత్మక రోజు జూలై 6న ప్రతి ఏడాది వరల్డ్ జునోసిస్ డే జరుపుకుంటామన్నారు. ఈసందర్భంగా 220 పెట్ డాగ్స్, క్యాట్స్ కు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లను ఉచితంగా వేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వెటర్నరీ యూనివర్శిటీ కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లు డా. జీవన్ జ్యోతి, డా. మోహిత శ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

## 370 ఆర్టికల్ రద్దు కోసం..

### 'ఏక్ దేశ్ మే దో నిశాన్, దో ప్రధాన్, దో విధాన్ నహీ చెలేగా నహీ చెలేగా'

### అంటూ నినదించిన వ్యక్తి శ్యామ ప్రసాద్ ముఖర్జీ.

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి



చిగురుమామిడి జులై 06 (ప్రజామంటలు): డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి జులై 6 సందర్భంగా వారి జీవిత చరిత్ర, ఆలోచన, స్ఫూర్తి. అనే అంశంపై చిగురుమామిడి మండలం, సైదపూర్ మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం బీజేపీ మండల అధ్యక్షులు పైడిపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఈనుగొండ నాగేశ్వర్ రెడ్డి మరియు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ముఖ్య అతిథులు నాగేశ్వర్ రెడ్డి మరియు రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.... ఏక్ దేశ్ మే దో నిశాన్, దో ప్రధాన్,దో విధాన్ నహీ చెలేగా నహీ చెలేగా ఈ నినాదం వినగానే మన కళ్ల ముందు కదులుతారు దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన మహా నేత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్ ను దేశంలో సమైక్య భాగంగా గుర్తించాలంటూ ఉద్యమించిన మహానేత ఆయన భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి జయంతి జూలై 6 సందర్భంగా ఆ మహనీయున్ని గుర్తు చేసుకుందాం అంటు వారి ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్లడం మన అందరి బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సైదపూర్ మండల అధ్యక్షులు కంది శ్రీనివాస్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు కంది శంకర్, కార్యదర్శి పడాల శ్రీనివాస్,తులైల వెంకటేష్, బీమారా లక్షమన్ దెంచనల శ్రీనివాస్,నెల్లి శ్రీనివాస్, మునిపాల అశోక్, వంగ సాగర్, దొమ్మటి వీరన్న, నిర్ల సతీష్,నిమ్మ రమాకాంత్ రెడ్డి, కాశవేని రమేష్, గంద్రోత్ రామన్న, కూన ముత్తయ్య, కరుణాకర్, గుల్ల వెంకటేశం, ఎన్నమ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాడిన గొప్పనేత బాబు జగ్జీవన్ రామ్

### ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



సికింద్రాబాద్ జూలై 06 (ప్రజామంటలు): సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్బంగా బన్సీలాల్ పేట డివిజన్ లోని కీస్ బ్లాక్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. దళితుల సామాజిక,రాజకీయ హక్కుల కోసం తన వాదాన్ని ఎంతో బలంగా వినిపించారని అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పార్శీ మహేశ్, నాయకులు ఐ.చిరంజీవి, చంద్రశేఖర్, రమేశ్, మోహన్ కృష్ణ, దుర్గేష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## శ్రీపాదరావు విగ్రహాన్ని కార్యాలయంలో పెడితే తప్పేంటి?

### కాంగ్రెస్ మహిళ నాయకులు



మహాదేవపూర్ జూలై 06 (ప్రజామంటలు): స్పీకర్ గా ఉభయ రాష్ట్రాలలో రాణించిన స్వర్గీయ శ్రీపాదరావు ప్రజాసేవలో ఉంటూనే ఈ మండలంలో తుది శ్వాస విడిచారని, ప్రభుత్వం ఆయన జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయించినందున మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శ్రీపాద రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తే తప్పేంటని కాంగ్రెస్ మహిళా నాయకులు విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బందెల సత్యమ్మ, కాటారం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు జాడి రాజేశ్వరి, మాజీ జెడ్పిటిసిలు ఆంగోతు సుగుణ,గుడాల అరుణ, మాజీ ఎంపీపీ బన్సోడా రాణిబాయి, కుంభం పద్మలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో శ్రీధర్ బాబు పక్షంలో ఉండి పుట్ట మధును తీవ్రంగా విమర్శించిన గీతాబాయి ఈరోజు శ్రీధర్ బాబును, శ్రీపాదరావును గతం మర్చిపోయి విమర్శించడాన్ని వీరు తప్పు పట్టారు. మండల పరిషత్ పాలకవర్గం సభ్యుల తీర్మానాన్ని అనుసరించే శ్రీపాదరావు విగ్రహాన్ని పెట్టడం జరిగిందని, ఘన చరిత్ర కలిగిన స్వర్గీయ శ్రీపాదరావుకు సమాజంలో ఎంతో గౌరవం ఉందని అన్నారు. మంథని చరిత్రను హత్యలతో భ్రష్టు పట్టించిన నాయకుల అండన ఉండి చవక బారు విమర్శలకు పాల్పడితే రాజకీయ భవిష్యత్తు ఉండదని విమర్శించారు.

## తంగళ్ళపల్లి రమేష్ పరామర్శ



ఎల్కతుర్తి జులై 6 (ప్రజామంటలు): ఎల్కతుర్తి నేతకానీ కాలనీ లో మరణించిన బండారి ఐలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందచేసిన పొన్నం యువసేన, తంగళ్లపల్లి రమేష్ ఎల్కతుర్తి కాంగ్రెస్ నాయకులు. మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి, పొన్నం యువసేన తరపున, కాం గ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి రమేష్, శీలం అనిల్ కుమార్ , అంబాలా స్వామి, శనిగరపు వెంకటేష్, పాక రమేష్, జగన్ అంబాల, నాగరాజు, చిలుముల వినోద్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన జగ్జీవన్ రామ్



సికింద్రాబాద్ జూల్కై 06 (ప్రజామంటలు): సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు బాబుజగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు .షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ., సనత్ నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు రాపాక అశోక్ ఆధ్వర్యంలో భారత ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు డా. బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని శనివారం బన్సీలాల్ పేట జబ్బర్ బిల్డింగ్ వద్ద మహనీయుల విగ్రహాల వద్ద నివాళుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సనత్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఏఐఎస్సిఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు రాగాల నాగేశ్వరరావు, బన్సీలాల్ పేట్ డివిజన్ కార్పొరేటర్ కురుమ హేమలత లక్ష్మీపతి, ఎస్సీఆర్పిఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్ బాబు, నగర ఉపాధ్యక్షులు కురుమ మహేందర్, డి. శంకర్, విష్ణు కిరణ్, ఎల్లం కుమార్, ఆలేటి బాలమని, పోతరాజు ప్రకాష్, బండారి శ్రీకాంత్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## గ్రామంలో ఎలాంటి సమస్యలో ఉన్న పోలీసులను నిర్భయంగా సంప్రదించండి..

### నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





బీర్పూర్ జూలై 6 (ప్రజా మంటలు)
మావోయిస్టు ముప్పాల లక్ష్మణ్‌రావు స్వస్థలమైన బీర్‌పూర్ గ్రామాన్ని ఎస్పీ సందర్శించారు. నక్సల్ భావజాలానికి మద్దతు ఇవ్వకుండా తప్పుడు మావోయిస్టు భావజాలం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ఈరోజు బీర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగేలా గ్రామంలో కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...భారత దేశ వ్యాప్తంగా నూతన చట్టాలు అమలు చేయడం జరిగిందని మహిళలకు, పిల్లలకు నూతన చట్టాలు మరింత అండగా మరియు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. నూతన చట్టాలలో నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా లోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించ వచ్చని తెలిపారు.మహిళలు, బాలికల, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరఫున షీ టీమ్ ఏ హెచ్ టి యు టీమ్ లు పనిచేస్తునయని అన్నరు . షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని లేదా 8712670783 వాట్సప్ ద్వారా కూడా పిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.యవత విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచిగా చదువుకొని ఉన్నత లక్షలను సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు మానసికగా బానిస కావడం ద్వారా అనుకోకుండా క్రైమ్ చేసే అవకాశం ఉంది అని అన్నారు. అనుకోకుండా ఏదైనా క్రైం చేసినట్లయితే ఎలాంటి ఉద్యోగం కూడా రాదని కావున డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో ఉన్నత లక్ష్యాల ను సాదంచాలనీ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, యువత ఎక్కువగా మత్తుకు బానిస అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి గురించిన సమాచారం తెలిస్తే ప్రజలు, స్థానిక పోలీసులకు గాని, డయల్ -100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. గంజాయి రవాణా, గంజాయి సేవించే వారిపై పటిష్ట నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి గారు హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసిన, అమ్మిన వెంటనే పోలీసు స్టేషన్ కి సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత రోజుల్లో అనేక సైబర్ మోసాలు బాగా పెరిగాయి వీటి నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా సొమ్ములు తిరిగి పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1930 ను ఆశ్రయించాలి అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని అట్లాంటి వాటి పై వెంటనే పోలీసువారికి తెలుపాలని సూచించారు, గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగింది పోలీసులకు సమాచారం అందించాలని అన్.జిల్లా నుంచి గల్ఫ్ వెళ్ళేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలి ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం. బాధితుల ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేస్తాం అన్నారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ , క్రికెట్ కిట్ లను, బుక్స్ ను ఎస్పీ చేతుల మీదుగా అంద చేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో డిఎస్పి రఘు చంధర్, సి.ఐ కృష్ణా రెడ్డి ఎస్.ఐ కుమారస్వామి, పోలీస్ సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి పూలమాలవేసి నివాళులర్పించిన బిజెపి నాయకులు



ఎల్కతుర్తి జులై 6 ప్రజా మంటలు
శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా పూలమాలవేసి ఘన నివాళి సమర్పించిన నాయకులు మాజీ శాసనసభ్యులు పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ మాజీ శాసనసభ్యులు శ్రీ కొండేటి శ్రీధర్ పార్లమెంటు ప్రబారి శ్రీ మురలీధర్ గౌడ్ గారు పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి 66వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ గురుమూర్తి శివకుమార్ వరంగల్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు శ్రీ గంటా రవికుమార్ 56 డివిజన్ అధ్యక్షులు మందోటి మహేందర్ పటేల్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి అమృత రావు పాల్గొని నివాళులర్పించడం జరిగింది.

# సైబర్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించాలి

### డయల్ 100 కాల్స్ కి తక్షణమే స్పందించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలి.



బీర్పూర్ జూలై 6( ప్రజా మంటలు)
బీర్పూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం ఆకస్మికంగా బీర్పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ మరియు టౌన్ సిబ్బంది అందరూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై పై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఎస్పీ వెంట డిఎస్పి రఘు చందర్ , రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఎస్ఐ కుమారస్వామి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన దేవాదాయ అధికారికి ఆత్మీయ సత్కారం







జూలై 6 (ప్రజా మంటలు)
ఇటీవల దేవాదాయ ధర్మదాయ శాఖలో ఈవోగా పనిచేసి పదవి విరమణ పొందిన ధర్మపురి వాస్తవ్యులు పణతుల వేణుగోపాల్ ను శనివారం బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రమ దంపతులను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ పెద్దలు, హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం పాల్గొన్నారు. తన విధి నిర్వహణలో సహకరించిన అందరికీ వేణుగోపాల్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు.

# జెడ్పీ హైస్కూల్లో మౌళిక సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల జూలై 06 (ప్రజామంటలు):
సారంగాపూర్ మండలం అర్పపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.పాఠశాలలో త్రాగునీరు పనులను మరియు వివిధ మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. వారు మీడియాతో మాట్లాడుతూ.... అనాది నుండి వర్షాకాలం జూలై ఆగస్టు మాసాలలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి పాఠశాలలో పిల్లల ద్వారా గాని గ్రామాలలో ప్రకృతి వనాలను పెంచే కార్యక్రమాన్ని మనం గమనిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి హరిత హారం అనే ఆలోచనతోనే మరింత ప్రోత్సహింప చేయాలని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. హరితహారంలో నాటే మొక్కలు పర్యావరానికి దోహదపడే మొక్కలు కాకుండా ఇతర మొక్కలు నాటడం కరెంట్ లైన్ క్రింద నాటడం వలన మనం ఆశించిన మేరకు ఫలితం పొందలేకపోతున్నాం. హరితహారంలో నాటే మొక్కలను ముందే ఎంపిక చేసుకోవాలి. వేప ప్రధానం మొక్క ఎదగడానికి కొంత జాప్యం అవుతుంది కానీ ఒక్క సారి వేప మొక్క నాటినట్టు అయితే దశాబ్దాల తరబడి మనకు ఆక్సిజన్ అందజేస్తుంది అలాగే కానుగు చెట్లను నాటాలి రోడ్ సైడ్ వెదురు బొంగు పండ్ల మొక్కలను నాటినట్టు అయితే ప్రకృతిని ప్రోత్సహించే విధంగా ఉంటుంది. రాష్ట్రంలో రైతాంగానికి సంబంధించి జాతీయస్థాయిలో గమనిస్తే దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేపడుతున్నటువంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదు
ఉచిత విద్యుత్ అనే కార్యక్రమం ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరంభిస్తే ఇప్పుడు తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్ లో అమలు అవుతుంది తప్ప దేశంలో ఎక్కడా కూడా బిజెపి పాలిత రాష్ట్రాలలో లేదు. రుణమాఫీకి సంబంధించి దేశంలో ఎక్కడ కూడా బిజెపి పాలిత రాష్ట్రాలలో రైతాంగానికి రుణమాఫీ సదుపాయం కల్పించాలని ఆలోచన లేదు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం నిర్దిష్టకంగా నిర్మాణాత్మకంగా 15 ఆగస్టు వరకు 2 లక్షల రుణమాఫీ చేయాలని ఆలోచనతోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుంది అన్నారు.
ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తుంది. రైతు భరోసా ఏ విధంగా ఇవ్వాలి రైతుకు ఏ విధంగా లాభం అవుతుంది దాని ఫలితం ఏ విధంగా ఉంటుంది. సాగులో ఉన్నటువంటి భూమికి మాత్రమే ఇవ్వాలన్నారు. తెలంగాణలో ఐదు ఎకరాలకు సీలింగ్ పెట్టుకున్న కానీ పంటకు 7500 ఇచ్చిన సంవత్సరానికి 75,000 వస్తాయి కేంద్ర ప్రభుత్వం 6000 పరిమితం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం 75,000 వరకు ఇవ్వడానికి పరిశీలిస్తున్నాం అన్నారు. వ్యవసాయ ఉత్పత్తి అనేది రైతుకు మేలు జరిగే విధంగా ఉండాలి వినియోగదారుని కూడా మేలు జరిగే విధంగా ఉండాలి వినియోగదారున్ని కూడా పరిగణంలోకి తీసుకోవాలి సన్న రకాల ప్రోత్సాహంతో వినియోగదారున్ని అండగా నిలబడే విధంగా కూడా ఈ కార్యక్రమం తోడ్పడుతుంది కాబట్టి ఇప్పుడు ఈ వర్షాకాలంలో సన్న రకాలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది దీని ఫలితం ఏ విధంగా ఉంటుంది పరిశీలించి తదుపరి కార్యక్రమం కొనసాగింపు ముందుకు వెళుతుంది వర్షాకాలం సన్న రకాలకు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుంది. పంటల బీమా పథకం ఫసల్ బీమా యోజన దేశంలో ఎక్కడైనా కానీ కేంద్ర ప్రభుత్వం 25% వాటా భరిస్తే 25% రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించడం మిగిలిన 50% రైతు భరించే విధంగా కార్యక్రమం అమలు అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రైతుపై ఏ విధమైనటువంటి భారం లేకుండా రైతు చెల్లించాల్సిన 50% కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించే విధంగా కార్యక్రమాన్ని అమలు చేసే విధంగా ఆలోచించడం హర్షించదగిన విషయం. ఈ కార్యక్రమాలు అన్నీ కూడా దేశంలో వివిధ రాష్ట్రాలు ఉన్నవి బిజెపి పాలిత రాష్ట్రాలు ఉన్నవి ఏ బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా ఈ విధమైన కార్యక్రమాలు అమలు చేయడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతోని తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాలు అమలు చేయబడుతుంది ఈ విషయాన్ని రైతాంగం గమనించాలి వినియోగదారులు కూడా ఈ అంశాన్ని పరిగణంలోకి తీసుకోవాలి.

# బాబూ జగ్జీవన్ రామ్ 116 వర్ధంతి

గొల్లపల్లి జులై 06 (ప్రజామంటలు):
గొల్లపెల్లి మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 116 వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తాండ్ర కిరణ్, ఉపాధ్యక్షులు దావుల రాకేష్ కుమార్ తాజా మాజీ సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి, జేరిపోతుల కొమరయ్య, జనప వెంకటేష్, చెవుల మద్ది గంగాధర్, నర్సాపురం రవీందర్, చెవులమద్ది మల్లేష్, చెవులమద్ది సంతోష్, ఉమేష్, జెరిపోతుల అనిల్, సుద్దాల ముత్యాలు, తాండ్ర పవన్, నేరెళ్ల మహేష్, శ్రీకాంత్, వెంకటేష్, మల్లేష్, జేరుపోతుల అంజి తదితరులు పాల్గొన్నారు.



# ఇక ఏటా రెండుసార్లు టెట్

## ఆదేశాలు జారీచేసిన విద్యాశాఖ



హైదరాబాద్ (ప్రజామంటలు):
టీచర్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు టీ సర్కార్ వెసులుబాటు కల్పించింది. ఇప్పటినుంచి ఏడాదికి రెండుసార్లు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ) నిర్వహిస్తామని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జూన్ లో ఒకసారి, డిసెంబర్ లో ఒకసారి టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఒక అభ్యర్థి ఎన్నిసా÷-లంల్గ÷నా టెట్ ఎగ్జామ్ రాసుకోవచ్చని ఉత్తర్వుల్లో తెలియజేసింది. టెట్ పరీక్ష పాస్ అయిన వారు మాత్రమే డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించనున్నారు. టెట్ మార్కులను డీఎస్సీలో వెయిటేజీగా ఇవ్వనున్నారు.

# గంజాయి కేసుతో ఉస్మానియా కాలేజీకి సంబంధం లేదు

## వారు పూర్వ విద్యార్థులు - కాలేజీ ప్రిన్సిపాల్ స్పష్టీకరణ



సికింద్రాబాద్ జూలై 06 (ప్రజామంటలు): గంజాయి కొనుగోలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన మెడికోలకు ఉస్మానియా మెడికల్ కాలేజీకి ఎలాంటి సంబంధం లేదని, వారు తమ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థులు మాత్రమే నని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్ కుమార్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... శుక్రవారం కోఠి బస్టాండ్ సమీపంలో గంజాయి కొనుగోలు చేస్తూ పట్టుబడిన డాక్టర్ కె. మణికందన్, డాక్టర్ వి. అరవింద్ లు గతంలో తమ కాలేజీలో చదివినట్లు తెలిపారు. మణికందన్ 2022 లో అకాడమిక్ ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకొని ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్ గా పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే అరవింద్ కూడా కాలేజీలో ఎంబీబీఎస్ చదివి వెళ్లిపోయినట్లు చెప్పారు. ఇలా కాలేజీకి సంబందం లేని వారు గంజాయి కేసులో పట్టుబడితే ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులని ప్రచారం చేయడం బాధకరమన్నారు. ఇంకా పది మంది స్టూడెంట్స్ ఉన్నారని చెప్పడం సరికాదన్నారు. స్టూడెంట్స్ గంజాయి కేసులో పట్టుబడ్డారన్న వదంతులతో కాలేజీ స్టూడెంట్స్ పేరెంట్స్ ఆందోళన చెందారన్నారు. ఇలాంటి వదంతులు నమ్మవద్దన్నారు. కాలేజీలో నిరంతరం స్టూడెంట్స్ ను మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు.

# కోల శారద స్మారక క్రికెట్ టోర్నమెంట్, విజేత రాఘుపట్నం టీం



గొల్లపల్లి జులై 06 (ప్రజామంటలు):
గొల్లపెల్లి మండల రాపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా కోల శారద స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా 15 టీములు పాల్గొనగా ఫైనల్ రాఘుపట్నం వర్సెస్ రాపల్లి తలపడగా రన్నర్పుగా రాఘపట్నం నిలిచింది కప్పుతోపాటు 5000 రూపాయలు అందించారు విన్నర్గా రాపల్లి నిలువగా పదివేల రూపాయలు బహుమతి దానితోపాటు కప్పు అందించిన తాజా మాజీ సర్పంచ్ నల్ల శ్యామ్. ఈ కార్యక్రమంలో తంగళ్ళ సత్తయ్య, కోల సంతోష్, మత్తుల పురం రమేష్, ఆది ప్రసాద్ ఎడ్ల తిరుపతి అరవింద్ గౌడ్, రాపల్లి గ్రామస్తులు, యూత్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# పౌరసరఫరాల అక్రమాలపై నజర్

## పక్కదారి పడుతున్న బియ్యంపై ఆరా



**హైదరాబాద్, జూలై 6 (ప్రజా మంటలు):** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల అక్రమ రవాణాకు అడుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న అక్రమ దందాకు చెక్‌పెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టం చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలను నిరంతరం పరిశీలించి బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలకు ఉపక్రమించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్నా మార్పు రాకుండా అలాగే రవాణా చేస్తే పీడీ యాక్టు కింద కఠిన చర్యలు చేపడతారు. అవసరమైతే రైసుమిల్లర్స్, రవాణా గుత్తే దారులపై చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు అక్కడక్కడ దాడులు నిర్వహించినప్పటికి పూర్తిస్థాయిలో అక్రమ రవాణా అరికట్టలేక పోతున్నారు. దీంతో అన్ని జిల్లాలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలు అవినీతి అరోపణలను ఎదుర్కొంటున్న పౌరసరఫరాల శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకు కఠిన చర్యలు తీఉకుంటున్నారు. ధాన్యం సేకరణలో రైతుకు కనీస మద్దతు ధర, సీఎంఆర్ పథకం కింద బియ్యానికి మెరుగుపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ఇతర పథకాలకు పౌరసరఫరాల సంస్థ రైసుమిల్లర్ల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేస్తోంది. ఏటా సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న శాఖలో అధికారులు, సిబ్బంది కొరతతో పాటు నిర్లక్ష్యంతో వందల కోట్ల రూపాయల సరకులు పక్కదారి పడుతున్నాయి. సరకులను పక్కదారి పట్టిస్తున్న అక్రమదారులను గుర్తించినా స్థానిక అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఐదు బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేస్తూ పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైసుమిల్లుల యాజమానులు, బియ్యం రవాణా గుత్తేదార్లు, చౌక ధరల దుకాణ డీలర్ల అక్రమాలను అరికట్టడమేగాక నాణ్యమైన సరకులను సరఫరా చేయడం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గట్టిగా పనిచేస్తోంది. పౌర సరఫరాల విభాగంలో వివిధ స్థాయిలో వాటి పనితీరుపై తనిఖీలు నిర్వహిస్తారు.

# రుణ సహకారంతోనే రైతన్నల సేద్యం

## బ్యాంకుల తీరుతో సకాలంలో అందని రుణాలు



**నిజామాబాద్,జూలై 6 (ప్రజా మంటలు):** పంటరుణాల పంపిణీలో జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా కిసాన్‌క్రెడిట్ కార్డులు ఊసేలేదు. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతులుంటారు కాబట్టి వీరిరికూడా వచ్చే వానాకాలం పంటరుణాన్ని దరిచేర్చేలా చర్యలుండాలి. కనీసం వచ్చే పంటకాలంలోనయినా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, ధీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపులైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

# బిఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు

**తలలు పట్టుకుంటున్న బిఆర్ఎస్ నేతలు**

**ఎవరు పార్టీ వీడుతారో అర్థం కాని పరిస్థితి**

**సైలెంట్‌గా చేరిపోయిన బండ్ల కృష్ణమోమన్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై6 (ప్రజామంటలు):** తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఎప్పుడు గులాబీ కండువా తీసేసి.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కారు దిగి హస్తం గూటికి చేరడం.. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారనే వార్తలతో పార్టీ పరిస్థితి ఏంటనేది హైకమాండ్‌కే తెలియక తలలు పట్టుకుంటోంది..! ఈ క్రమంలో గద్వాల ఎ మ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా సిఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే మూకుమ్మడిగా కాకుండా ఒకకొక్కరుగా పార్టీని వీడడం అర్థం కావడం లేదు. సరిగ్గా ఈ క్రమంలోనే తెలంగాణ భవన్ వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ కీలక సమావేశానికి పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసలే మరో ఆరుగురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే వార్తల నేపథ్యంలో భేటీ జరగడం.. ఈ సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే అనుమానాలకు తావిచ్చినట్లయ్యింది. తొలిరోజు సమావేశానికి రాలేదు సరే.. రెండో రోజు కూడా హాజరుకాకపోవడంతో పార్టీ మార్పు పక్కా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో వేదికగా కీలక సమావేశం నిర్వహించడం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా శనివారం జరిగన కౌన్సిల్ సమావేశానికి రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కౌన్సిల్ భేటీకి ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి డుమ్మా కొట్టారు. కౌన్సిల్ భేటీకి కచ్చితంగా హాజరుకావాలని అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో

ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఏమయ్యారు..? బీఆర్ఎస్‌కు బై బై చెప్పడానికి రంగం సిద్ధం చేసుకున్నారా..? లేకుంటే మరేదైనా కారణాలతో డుమ్మా కొట్టారా అనేది తెలియట్లేదు.రాష్ట్ర రాజధాని పరిధిలో బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ఏడుగురు శక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. కండువాల మార్పిడి సీజన్ నడుస్తోన్న సమయంలో ఒకరోజు ముందు సమాచారమిచ్చి మరీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశ ౯మయ్యారు. ఈ మీటింగ్‌కు హైదరాబాద్‌లోనే ఉండి కూడా కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడం పార్టీ మారుతారనే వార్తలకు బలం చేకూరుతోంది. నిన్నటి సమావే శానికి.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), పద్మారావు (సికింద్రాబాద్), ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), సుధీర్‌రెడ్డి(ఎల్‌బీనగర్), మాగంటి గోపినాథ్ (జూబ్లీహిల్స్), ముఠా గోపాల్ (ముషీరాబాద్), కాలేరు వెంకటేష్ (అంబర్‌పేట) హాజరయ్యారు. అయితే.. అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), బండారి లక్ష్మారెడ్డి(ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజ్‌గిరి), కేపీ వివేకానందగౌడ్ (కుత్బుల్లాపూర్), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు)లు రాలేదు. దీంతో ఇవాళ అయినా.. కౌన్సిల్‌కు వస్తారనుకుంటే రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.



# మంత్రి శ్రీధర్ బాబుతో విపక్ష ఎమ్మెల్యే భేటీ

## నియోజవర్గ అభివృద్ధికి సహకరించాలని వినతి

## ఎమ్మెల్యేలు కలవడంపై సర్వత్రా చర్చ

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును శనివారం భారాస ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేకానందగౌడ, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కలిశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు మంత్రికి అందజేశారు. జీహెచ్ఎంసీ కి నిధులు విడుదల చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు ప్రతి పాదనలను మంత్రి శ్రీధర్ బాబుకు అం దించారు ఎమ్మెల్యేలు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదన్నారు. కూకట్ పల్లి నియోజకర్గంలోని చెరువులు, కుంటల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగించాలని.. దోమలను నివారించాలని ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావు కోరారు. నియోజకర్గంలోని అన్ని డివిజన్ లలో ఎలక్ట్రికల్ పోల్స్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కూకట్ పల్లి, మూసాపేట్ సర్కిళ్ళ పరిధిలో నెలకొన్న శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని, అలాగే కూకట్ పల్లి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాలకు అతీతం గా పనులు చేయడం జరుగుతుందన్నారు. తప్పకుండా మీ సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిని కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా రేపో మాపో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని ఇప్పటికే పలువురు మంత్రులు చెప్పిన సంగతి తెలిసిందే..

# కేంద్రం రెండు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నం : ఎంపీ లక్ష్మణ్

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన సమస్యలను పరిష్కరించు కోవాలని ఎంపీ లక్ష్మణ్ కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రెండు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. తిరుపతి పవిత్రతను కాపాడాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాస్తున్నట్లు చెప్పారు. తిరుమలలో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూ కశ్మీర్ ప్రజలకు మోదీ రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందని పేర్కొన్నారు. ముస్లింలకు భాజపా వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ విష ప్రచారం చేసిందన్నారు. మతపరమైన రిజర్వేషన్లను మాత్రమే భాజపా వ్యతిరేకించిందని చెప్పారు. రిజర్వేషన్లు రద్దు, రాజ్యాంగాన్ని మారుస్తామని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసి లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందిందని లక్ష్మణ్ విమర్శించారు.

# అవినీతి కేసులో గుంతకల్లు డిఆర్‌ఎం

## వినీత్ సింగ్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ

## కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేయడంతో అరెస్ట్



**అనంతపురం,జూలై6 (ప్రజా మంటలు):** అవినీతి కేసులో గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. కడప జిల్లాకు చెందిన ఓ రైల్వే కాంట్రాక్టర్‌ను రైల్వే అధికారులు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైల్వే అధికారులపై సీబీఐకి కాంట్రాక్టర్ రమేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు రెండు రోజుల పాటు అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌తో పాటు, కుందా ప్రదీప్ బాబు, అక్కిరెడ్డి, బాలాజీ, లక్ష్మీపతి రాజులను సీబీఐ అదుపులోకి తీసుకుంది. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో జరిగిన కాంట్రాక్ట్ పనుల్లో రైల్వే అధికారులు కోట్ల రూపాయల్లో అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌లతో పాటు మిగిలిన వారిని అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు.. వారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం అరెస్టు అయిన రైల్వే అధికారులను సికింద్రాబాద్ తరలిస్తున్నారు. గుంతకల్లు రైల్వే డీఆర్ఎం కార్యాలయం వివిధ విభాగాల్లో సీబీఐ సోదాలు చేసింది. రైల్వే డీఆర్ఎం వినీత్‌సింగ్ నివాసంలో తనిఖీలు పూర్తయ్యాయి. సింగ్ నివాసంలో భారీగా బంగారం, నగదు పట్టుబడింది. ఎనిమిది మంది సిబ్బందిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్, డీఎఫ్ఎం ప్రదీప్ బాబు, సిబ్బంది రాజు, ప్రసాద్, బాలాజీ సీబీఐ అదుపులో ఉన్నారు. నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వారిని సీబీఐ కోర్టుకు తరలించనున్నారు. గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో భాగమైన ఆర్థిక విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది నివాస గృహాల్లో సికింద్రాబాద్‌కు చెందిన సీబీఐ అధికారులు తనిఖీలు చేశారు. ఆర్థిక విభాగంలో పని చేస్తున్న సీనియర్ డివిజన్ ఫైనాన్స్ మేనేజర్(డీఎఫ్ఎం) ప్రదీప్‌బాబుతో పాటు మరికొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో సీబీఐ అధికారులు గత మూడు రోజుల నుంచి గుంతకల్లులో మకాం వేశారు. కదిరి ప్రాంతంలో రైల్వే మోరీ పనులకు సంబంధించి ఆ ప్రాంతానికి చెందిన గుత్తేదారులకు పనిని అప్పగించడానికి ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రదీప్‌బాబుతో పాటు కొందరు సిబ్బంది డబ్బును డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సీబీఐ అధికారులు తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది గృహాల్లో దాడి చేసి..భారీగా నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.

# ఉనికి కోసమే కాంగ్రెస్, బిజెపిల విమర్శలు

## అభివృద్ధి అంటే ఏమిటో చూపిన కెసిఆర్

సిద్దిపేట, జూలై 6 (ప్రజామంటలు):
ఉమ్మడి ఎపిలో తెలంగాణలో అన్నివర్గాలకు అన్యాయమే జరిగిందని, ఎరువులు, విత్తనాలు, కరెంటు కోసం రోడ్లెక్కిన విషయం తెలిసిందేనని అటవీ అభివృద్ధిశాఖ మాజీ ఛైర్మన్ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ఎన్నో కొత్త పథకాలను తెచ్చిన కేసీఆర్ ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉన్నారన్నారు. ఇంటింటికి మంచినీరు, నిరంతర కరెంట్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కెసిఆర్ ఘనత అన్నారు. ఉనికికోసమే కాంగ్రెస్,బిజెపి నేతలు కెసిఆర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు కావాలనే విమర్శలు చేస్తున్నారని అన్నారు. స్వార్థరాజకీయాల కోసమే బిజెపి విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఉనికిని చాటుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రాంత నాయకులకు వంత పాడుతూ తెలంగాణకు ద్రోహం చేసిన విషయం ప్రజలు ఇంకా మరచిపోలేదని తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్ చేసిన అబివృద్ధిని చూసి ఓర్వలేని వారు విమర్శలు చేస్తున్నాయని వంటేరు విమర్శించారు.

## నిధులు పక్కదారి పట్టాయి

హైదరాబాద్, జూలై 6 (ప్రజామంటలు):
రెండున్నర దశాబ్దాల కాలంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సుమారు రూ.70 వేల కోట్లు పక్క దారి పట్టాయని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. దళిత, గిరిజనుల సంక్షేమంపై గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చాలాకాలం తరవాత దళితుల సంక్షేమం గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్ష కమిటీని దిల్లీకి తీసుకెళ్లాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా రాజకీయ విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# భద్రాద్రి అభివృద్ధిపై పడని అడుగులు

## మాస్టర్‌ప్లాన్ వెనక్కి పోయినట్లేనా? - పట్టింపు లేని నేతలు

భద్రాద్రికొత్తగూడెం,జూలై6 (ప్రజామంటలు):
యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో భద్రాచలానికి వచ్చి అధికారులు,నాటి మంత్రి తుమ్మల తదితరులతో చర్చించి, పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా ఇప్పుడు మళ్లీ బలంగా ఉన్నందున ఆయన దీనిని ముందుకు తీసుకుని వెళ్లాలని అన్నారు. గతంలో ప్రకటించిన వంద కోట్ల అభివృద్ధి నిధులతో చేపట్టబోయే పనుల కోసం ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రి లాగా భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని జాతీయస్థాయిలో ప్రముఖ పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పంగా ఉందని నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇప్పుడు ఆయన కూడా మంత్రిగా ఉన్నందున చొరవ తీసుకోవాలని అన్నారు. ఏళ్లు దాటినా కార్యాచరణ గడపదాటలేదు. ఇక్కడ ఏటా శ్రీరామ నవమి, సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయినా ఆలయ అభివృద్ధి ప్రణాళిక మాత్రం ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధిని చేపట్టి భద్రాద్రిని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులుకోరుతున్నారు.

# మందకొడిగా పన్ను వసూళ్లు

## బకాయిలు రాబట్టడంలో నిర్లక్ష్యం

హైదరాబాద్, జూలై 6 (ప్రజామంటలు):
జంటనగరాల్లో ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం,కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది.లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలిటీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది ఆస్తి పన్ను, దుకాణాల అద్దె, కొళాయిల పన్ను కలుపుకుని 50 శాతానికి మించి వసూలు కాలేదని సమాచారం. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చా లంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్‌మెంట్ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.మునిసిపాలిటీకి ఆదాయం ఆస్తి పన్ను, మునిసిపల్ దుకాణాల అద్దదె రూపంలో వస్తుంది. వ్యాపార, వాణజ్య సముదాయాలు, మాల్స్, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్‌లు, సినిమా థియేటర్లు, విద్యాసంస్థలు, షోరూంల నుంచి ఆదాయం ఎంతో రావాలి.

# కొనుగోళ్లు జరక్క కంది రైతుల అవస్థలు

## పెట్టుబడులు రాక అన్నదాతు ఆందోళన

రంగారెడ్డి,ఫిబ్రవరి6 (ప్రజామంటలు):
అష్టకష్టాలు పడి పండించిన పంటను సైతం రైతన్న అమ్ముకోలేక దిగాలు పడుతున్నాడు. రేయింబవళ్లు కష్టపడి, ఎకరాకు 10వేల నుంచి రూ.20వేలు పెట్టుబడి పెట్టి పండించిన పంటకు ధర అందక రైతన్న కుదేలవుతున్నాడు. మద్దతు ధరకైనా అమ్ముకుందామంటే కొనేవారు లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. నిన్నటి దాక పత్తి అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడిన రైతులు నేడు కందులు విక్రయించడానికి అవస్థలు పడుతున్నారు. మార్కెట్లలో రాశులు పోసి కొనేవారికోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ప్రారంభించిన చోట కొనుగోలు లేక రైతులు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. గతంలో కందులు హాకాసంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేవారు. ఇప్పుడు హాకాసంస్థ కొనుగోలు చేయట్లేదు. దాంతో కందుల కొనుగోలు బాధ్యతను మార్కెఫెడ్ సంస్థకు అప్పగించారు. అటు సహకార సంఘాల సిబ్బంది ఎన్నికల హడావుడిలో ఉండటంతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చోట కూడా కందులు కొనుగోలు చేయడం లేదు.

# తగ్గిన ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు

## నాణ్యతా లోపమే అంటున్న జనం

విజయవాడ,జూలై6 (ప్రజామంటలు):
పట్టణంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిన ఆన్‌లైన్ ఫుడ్ బిజినెస్ ఇప్పుడు అమాంతంగా పడిపోయింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు గతంతో పోలిస్తే 40 శాతంపైగా పడిపోయాయి. నాణ్యతా లోపమే దీనికి కారణమని తెలుస్తోంది. ఆన్‌లైన్ ఆర్డర్లతో హోటళ్ల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా పెద్దఎత్తున సాగింది. అయితే ఈ ముచ్చట ఏడాది గడవకముందే తీరిపోయింది. ఏడాది క్రితం గుంటూరులో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ చేసే సంస్థలు ప్రవేశించాయి. విశేష ఆదరణ పొందాయి. ఒక్క వినియోగదారులకే కాకుండా హోటళ్లకు కూడా విపరీతమైన వ్యాపారాన్ని సమకూర్చిపెట్టాయి. అయితే ఏడాది తిరక్కుండానే ఆన్‌లైన్ ఆర్డర్లు భారీగా తగ్గిపోయాయి. ఒకప్పుడు ఏ వీధిలో చూసినా, ఏ హోటల్ ముందు చూసినా రెండు ప్రఖ్యాత సంస్థల డెలివరీ బాయ్స్ దర్శనమిచ్చేవారు. కానీ ప్రస్తుతం వారి కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రమంగా ఈ మార్పు వచ్చిందని వ్యాపారులు కూడా అంగీకరిస్తున్నారు. నలుగురు కలిస్తే ఆర్డర్ ఇప్పించేలా వ్యవస్థ సృష్టించబడింది. ఈ క్రమంలోనే క్వాలిటీ, క్వాంటిటీ పడిపోయాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో వినియోగదారులు అసంతృప్తి చెందారు. డెలివరీలు తగ్గించి నేరుగా హోటళ్ల నుంచి తెప్పించుకునేందుకే ఇష్టపడుతున్నారు. ఇదే విషయంపై డెలివరీ బాయ్స్‌ను అభిప్రాయం అడగ్గా పార్శిల్ అంటే నాణ్యత విషయంలో రాజీపడ్డారని, అదే విధంగా సాధారణంగా ఇచ్చే పరిమాణం కన్నా తగ్గించారని హోటల్స్‌లో కూడా వారి వద్దకు వచ్చే వినియోగదారుల కోసం ఒక రకం వంట, ఆన్‌లైన్ వారి కోసం ప్రత్యేకంగా మరో వంట తయారు చేశారని దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. వినియోగదారులు మాత్రం పెరగలేదు. కారణాలు అర్థం కావడం లేదని కొందరు హోటళ్ల యజమానులు వాపోయారు.

# తేరుకోలేక పోతున్న నిర్మాణ రంగం

## కొల్లూరు ఇటుకకు దక్కని ఆదరణ

విజయవాడ,జూలై6 (ప్రజామంటలు):
గత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్లో చేసిన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. క్రమేపీ ఇసుక కొరత తీరినప్పటికీ నిర్మాణరంగం తేరుకోకపోవడంతో ఆ ప్రభావం ఇటుక పరిశ్రమపై పడింది. కొల్లూరు మండలంలోని లంకగ్రామాల్లో సుమారు 200 వరకు ఇటుక పరిశ్రమలు ఉన్నాయి. గత మూడు నాలుగేళ్లుగా ధర పలుకగా నేడు కొనుగోళ్లు బాగా తగ్గిపోవడంతో ధరలు సగానికి సగం పడిపోయాయి. గత సీజన్‌లో తీసిన ఇటుకలు బట్టీల రూపంలో కల్లాల్లోనే ఉండటంతో పరిశ్రమదారులు ఇటుక ఉత్పత్తిని తగ్గించేశారు. గత సీజన్‌లో 50 లక్షల ఇటుకలు తీసిన వారు నేడు 20 లక్షల ఇటుకలను మాత్రమే ఉత్పత్తి చేసేందుకు సిద్ధమయ్యారు. మరి కొంతమంది గత 7-8 నెలలుగా ఇటుకల విక్రయాలు లేకపోవడం, ధరలు క్షీణించడంతో నష్టపోయిన పరిశ్రమదారులు ఇటుకతీతకు ప్రస్తుత సీజన్‌లో స్వస్తి పలికారు. ఇటుక పరిశ్రమపై ఆధారపడిన వేలాదిమంది కూలీలు ఈ సీజన్‌లో ఉపాధి కోల్పోయారు. ఇటుక ఉత్పత్తిని పరిశ్రమదారులు సగానికి పైగా తగ్గించి గతంలో కంటే తక్కువ మంది కూలీలతో ఇటుక ఉత్పత్తి చేయిస్తున్నారు. కూలీలకు ఉపాధి లేకపోవడంతో చేసేదిలేక పరిశ్రమదారుల వద్దకు వెళ్లి కొంతకూలీ తగ్గించి అయినా పనులు చూపించాలని కోరుతుండటం గమనార్హం! కొల్లూరు ఇటుక పరిశ్రమల్లో పనిచేసేందుకు పరిసర గ్రామాల నుంచే కాకుండా విశాఖపట్నం, తూర్పు గోదావరి, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల నుంచి వేలాది మంది కూలీలు ఇటుక తీతకు వలస వస్తారు. ప్రస్తుత సీజన్‌లో వలస కూలీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇటుక విక్రయాలు తగ్గిపోవడంతో ఆ ప్రభావం రవాణా వ్యవస్థపైనా పడింది. పరిశ్రమల్లో ఉత్పత్తి చేసిన ఇటుకను చేరవేయడంపై 300కు పైగా లారీలు, 500కు పైగా ట్రాక్టర్లు ఆధారపడి ఉన్నాయి. ఇటుక రవాణా లేకపోవడంతో వాటిపై ఆధారపడి జీవించేవారికి ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటుక ఉత్పత్తి చేస్తే లక్ష ఇటుకలకు రూ.లక్షన్నర వరకు నష్టం వస్తున్నట్లు పరిశ్రమదారులు చెబుతున్నారు. ఒక్క ఇటుక తయారీకి నాలుగున్నర రూపాయలు ఖర్చవుతుంది. ప్రస్తుతం ఒక ఇటుకను మూడు రూపాయలకు మాత్రమే విక్రయించడం వల్ల నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇటుక తయారీ చేసి కాల్చిన తర్వాత కొన్ని ఇటుకలు చిట్యాలుగా, దూతరాయిగా అవుతాయని వాటిని తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇవన్నీ లెక్కేస్తే లక్ష ఇటుకలు తయారుచేస్తే రూ.లక్షన్నర నష్టపోవాల్సి వస్తుందని పరిశ్రమదారులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు భవిష్యత్తులోనూ కొనసాగితే ఇటుక పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రసాభాసగా గ్రేటర్ కార్పొరేషన్ సమావేశం

### బిజెపి, బిఆర్ఎస్ కార్పోరేటర్ల ఆందోళన
### మేయర్ పోడియం చుట్టుముట్టి రాజీనామాకు డిమాండ్
### ప్లకార్డులు ప్రదర్శించిన బిఆర్ఎస్ కార్పోరేటర్లు



హైదరాబాద్, జూలై 6 (ప్రజామంటలు):
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొమ్మిదో కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ,బీజేపీ కార్పొరేటర్లు సమావేశం ప్రారంభానికి ముందే ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. నిరసనలతో కొద్ది నిమిషాల్లోనే మీటింగ్ గందరగోళంగా మారింది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. ఆమె పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని.. మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మేయర్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మేయర్ అన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. మీటింగ్ 15 నిమిషాలు వాయిదా వేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వాయిదా అనంతరం సమావేశాలు తిరిగి ప్రారంభం కాగా.. నేతలు తమ పరిధిలోని సమస్యలను ఏకరవు పెట్టారు.బల్దియా కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్ ,బీఆర్ఎస్, ఎంఐఎం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు, బీజేపీ నేతలు హాజరయ్యారు. కాగా, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు. మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత, మరికొంత మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో వీరి రాజీనామాకు పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన గ్రేటర్ ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని నిర్దేశిరచింది. పార్టీ మారిన మేయర్ రాజీనామా డిమాండ్, ఇతర సమస్యలపై బహిరంగంగా ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమయ్యారు.150 మంది కార్పొరేటర్లలో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలు. మరో ఇద్దరు ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్ కార్పొరేటర్లు చనిపోయారు. ప్రస్తుతం 47 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు 41 మంది, బీజేపీకి 39, కాంగ్రెస్‌కు 19 మంది సభ్యులున్నారు. దాదాపు నాలుగున్నర నెలల తర్వాత జరుగుతున్న కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్ని పార్టీలకు సంబంధించి 23 ప్రశ్నలతో సుదీర్ఘంగా చర్చ సాగేలా సభ సిద్ధమైంది. ఈ క్రమంలో సమావేశం ప్రారంభం కాగానే.. బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసనతో సభ రసాభాసగా మారింది. అనంతరం నగరంలో పారిశుద్ధ్యం సరిగ్గా లేదని.. మేయర్ సహా అధికారులు చోద్యం చూస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర నేతలు సైతం జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలు ఏకరవు పెట్టారు. వానా కాలం సమీపించినా నాలాల్లో పూడిక తీత పనులు జరగట్లేదని ఆందోళనకు దిగారు. చెరువులు కబ్జాకు గురవుతున్నాయని.. ఖాళీ పైపులు, గుర్రపు డెక్కలతో కొందరు కార్పొరేటర్లు నిరసన తెలిపారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు.

# హత్రాస్ ఘటన దిగ్భ్రాంతి కలిగించింది

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

మీడియా ముందుకు వచ్చిన భోలే బాబా

న్యూఢిల్లీ (ప్రజామంటలు): ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన హాథ్రస్ తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. దాంతో 'భోలే బాబా పేరు దేశమంతా మార్మోగిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఆ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'జులై 2 ఘటనతో మేం చాలా వేదనకు గురయ్యాం. ఈ క్లిష్ట సమయంలో ఆ భగవంతుడు బాధను భరించే శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. తొక్కిసలాటకు బాధ్యులైన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేను నమ్ముతున్నాను. నాకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. మృతులు, గాయపడిన కుటుంబాలకు అండగా ఉండాలని కమిటీ సభ్యులకు సూచించాను' అని మీడియా ముందు మాట్లాడారు.అలీగఢ్‌తోపాటు హాథ్రస్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి మంగళవారం సత్సంగ్ పేరుతో బాబా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటారు. వేల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. కొన్నిసార్లు లక్షల్లో జనం వస్తుంటారు. జులై 2న హాథ్రస్‌లో నిర్వహించిన సత్సంగ్‌కు 80వేల మందికి ఏర్పాట్లు చేయగా.. రెండున్నర లక్షలమంది హాజరయ్యారు. 'సేవాదర్ ఆర్మీ'గా పిలిచే బృందం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక ఆ రోజు ముఖ్యసేవాదర్‌గా ఉన్న దేవ్‌ప్రకాశ్ మధుకర్ శుక్రవారం రాత్రి దిల్లీలో పోలీసుల ముందు లొంగిపోయాడు. పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లో అతడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

# ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

## తొలిసారెను సమర్పించిన వైదిక కమిటీ

విజయవాడ,జూలై 6 (ప్రజామంటలు):
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ సన్నిధిలో ఆషాడ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుంచి ఆగస్టు 4 వరకు ఈ మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వైదిక కమిటీ సభ్యులు తొలిసారెను సమర్పించారు. మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారికి కమిటీ సభ్యులు సారెను సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, చలిమిడి, గోరింటాకును భక్తులు సమర్పించారు. ఆషాడ మాసం తొలిరోజు కావడంతో ఇంద్రకీలాద్రి భక్తులతో కిక్కిరిసింది. ఆషాడ మసోత్సవాల సందర్భంగా నెలరోజుల పాటు ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడనుంది. అలాగే అమ్మవారికి శివస్వామి సారెను సమర్పించారు. 116 మంది భక్తులతో కలిసి వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆషాడ మాసం నెలరోజుల పాటు అమ్మవారికి భక్తులు సారెను సమర్పించనున్నారు. ఆషాడ మాసోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మను సారెను సమర్పిం చేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

# దేవభూమిలో వరదబీభత్సం

## కొండచరియలు విరిగి ఇద్దరు మృతి

## హైదరాబాద్‌కు చెందిన వారిగా గుర్తింపు

నైనిటాల్,జూలై6 (ప్రజామంటలు):
దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. చమోలీ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికులు మృతిచెందినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. కర్ణప్రయాగ, గౌచర్ మధ్యలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన నిర్మల్ షాహీ (36), సత్య నారాయణ (50) బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని బైక్‌పై తిరిగొస్తుండగా.. మార్గమధ్యంలో కొండచరియలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను శిథిలాల నుంచి బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్ వ్యాప్తంగా ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అటు కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ నేషనల్ హైవే పలు చోట్ల ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రప్రయాగ్-కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై కూడా రాకపోకలను నిలిచాయి. శని, ఆదివారాల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ముందజాగ్రత్త చర్యగా రుద్రప్రయాగ్‌లో అన్ని స్కూళ్లకు నేడు సెలవు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com